

జిల్లా కేంద్రాల పేరుతో.. రియల్ జోరు





రాయచోటిలోని వెంచర్

- మదనపల్లెలో యమ స్పీడు..
- రాయచోటిలో ఇప్పుడిప్పుడే కదలిక

జిల్లా కేంద్రాల పేరుతో మదనపల్లె, రాయచోటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మళ్లీ రెక్కలు వచ్చాయి. మదనపల్లె పట్టణంలో ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం యమ స్పీడుగా జరుగుతుండగా రాయచోటి పట్టణంలో ఇప్పుడిప్పుడే కదలిక మొదలైంది. దీంతో మళ్లీ రియల్ ఎస్టేట్ బ్రోకర్లు హడావుడి చేస్తున్నారు. ఈ హడావుడి చూసిన సామాన్యులు జిల్లా కేంద్రం పేరుతో స్థలాల ధరలు విపరీతంగా పెరిగిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2022లో కొత్తగా జిల్లాలను ఏర్పాటు చేసింది. పార్లమెంటు స్థానాల ఆధారంగా ఈ జిల్లాల ఏర్పాటు జరిగింది. దీంతో అప్పటికే కడప జిల్లా నుంచి మూడు, చిత్తూరు జిల్లా నుంచి మరో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి అన్నమయ్య జిల్లా ఏర్పడింది. వాస్తవానికి రాజంపేట పార్లమెంటు స్థానంలో పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఉంది. అయితే అప్పట్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిళ్లతో పుంగనూరును చిత్తూరు జిల్లాలోనే ఉంచారు. ఇదే సమయంలో అప్పట్లో తమ ప్రాంతం జిల్లా కేంద్రం కావాలంటే తమ ప్రాంతం కావాలని రాయచోటి, రాజంపేట, మదనపల్లెకు చెందిన ప్రజలు, రాజకీయ నాయకులు ఆందోళనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సమ దూరంలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటుందనే కారణంతో రాయచోటిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయినా రాజంపేట, మదనపల్లె ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం డిమాండ్ ఉంది. ఈ పరిస్థితుల్లో 2024 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు, 2023లో యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ మదనపల్లె పర్యటనలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జిల్లాల ఏర్పాటును సక్రమంగా చేయలేదని, తాము అధికారంలోకి వస్తే మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేస్తామని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు రాజంపేటకు కూడా న్యాయం చేస్తామని ప్రకటించారు. దీంతో రాజంపేట ప్రజలు చంద్రబాబు చెప్పిన న్యాయం అంటే రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తారని ఆశించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఎప్పుడెప్పుడు మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తారా? అని అక్కడి ప్రజలు, నాయకులు ఎదురు చూస్తున్నారు. అదే విధంగా సుమారు రెండు నెలలుగా ప్రభుత్వ పెద్దలు జిల్లాల కేంద్రాల ఏర్పాటు విషయమై బహిరంగంగా మాట్లాడారు. ఈ జిల్లాల ఏర్పాటు విషయమై నలుగురు మంత్రులతో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో తమకు జిల్లా కేంద్రం కావాలనే డిమాండ్ జోరందుకుంది. అంతకుముందు పుంగనూరును అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు కూడా అవసరమైన ఏర్పాట్లు జరిగిపోయాయి. ఇక నేడో రేపు పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలుపుతారనే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, పేర్ల మార్పు, సరిహద్దుల దిద్దుబాటు కోసం సబ్ కమిటీ ఏర్పాటు కావడంతో ఈ ప్రతిపాదన తాత్కాలికంగా పక్కన పడింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మళ్లీ రెక్కలు

అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏది ఏర్పడుతుందో? కచ్చితంగా తెలియకముందు రాజంపేట, రాయచోటి, మదనపల్లె ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగింది. ఇక్కడ జిల్లా కేంద్రం వస్తుంది. అక్కడ ఎస్పీ ఆఫీసు వస్తుంది అంటూ బ్రోకర్లు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. దీంతో ఎక్కడో పట్టణానికి ఆరేడు కిలోమీటర్ల దూరంలో సైతం ఎకరాలు కోట్ల రూపాయలు పెట్టి కొన్నారు. జిల్లా కేంద్రం వస్తే ఏదో అద్భుతం జరిగిపోతుందనే భ్రమతో పెట్టుబడులు పెట్టిన ఎందరో తర్వాత నిండా మునిగిపోయారు. ఈ పరిస్థితి ఎక్కువగా రాయచోటి ప్రాంతంలో జరిగిందనే చెప్పవచ్చు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత రాయచోటి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల వాళ్లే కాకుండా తిరుపతి, కదిరి, కడపతో పాటు పక్క జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టారు. 2022 నుంచి ఇప్పటి వరకు మళ్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారం పైకి లేవలేదు. ఈ పరిస్థితుల్లో ఈనెల 1న ముఖ్యమంత్రి చంద్రబాబు రాజంపేటకు పర్యటనకు వచ్చిన సందర్భంగా సభలో కొందరు రాజంపేట జిల్లా కేంద్రం విషయం ప్రస్తావించారు. అయితే రాజంపేటకు జిల్లా కేంద్రం విషయమై చంద్రబాబు నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ దెబ్బతో రాయచోటి జిల్లా కేంద్రానికి వచ్చిన సమస్య ఏం లేదనే భావన సర్వత్రా ఏర్పడింది. దీంతో వెంటనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగిపోయారు. రాయచోటే జిల్లా కేంద్రంగా ఉంటుందంటూ మళ్లీ వ్యాపారం మొదలు పెట్టారు. ఈ పరిస్థితుల్లో రాయచోటిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కదలిక ఏర్పడిందని చెప్పవచ్చు. అయితే జిల్లాల ఏర్పాటు విషయమై రాష్ట్ర మంత్రులతో సబ్ కమిటీ ఏర్పడిన నాటి నుంచే మదనపల్లెలో రియల్ ఎస్టేట్ వ్యాపారం యమ జోరుగా సాగుతోంది. ఈ జోరు ఎంత వరకు వెళుతుందనేది తెలియక ఆందోళన సామాన్యుల్లో నెలకొంది. ఇల్లు కట్టుకోవడానికి కూడా వీలు కాకుండా స్థలాల ధరలు నింగిలోకి వెళతాయేమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

భళా.. కళా ఉత్సవ్...

- రాయచోటి డైట్ కేంద్రంలో ప్రారంభమైన ఉత్సవాలు
- ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యాలు



కళా ఉత్సవ్ పోటీల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని

రాయచోటిలో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి. గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, కథాకథనం పోటీల్లో 47 పాఠశాలల నుంచి 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతి విభాగంలో పోటాపోటీగా తమ ప్రతిభను ప్రదర్శించారు.

-వివరాలు 6లో

అక్రమ రిజిస్ట్రేషన్ల ఫలితం..
ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

మదనపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీలేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పూతలపట్టు రాజును స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ (కడప) సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మదనపల్లె ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన రాజు నిషేధిత జాబితా (22ఏ)లోని భూమిని రిజిస్ట్రేషన్ చేశారని కలెక్టర్ చామకూరి శ్రీధర్ గుర్తించి ఆ శాఖ అధికారులకు చర్యలకు సిఫార్సు చేశారు. మదనపల్లె మండలం వలసపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-546-1లో 3.34 ఎకరాల భూమిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు వి.మాధవరెడ్డి కుమారుడు వి.మోనీష్‌రెడ్డి పేరున రిజిస్ట్రేషన్ చేశారు. ఎస్.సుశీల పేరుతో ఉన్న అసైన్‌మెంట్ పట్టాను నిబంధనలకు విరుద్ధంగా 22ఏ జాబితా నుంచి తొలగించి వి.మోనీష్‌రెడ్డి (డాక్యుమెంట్ నెంబర్-620-2024) పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై ఇప్పటికే విచారణ చేపట్టిన కలెక్టర్ నిబంధనలను అతిక్రమించిన రాజుపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ డీఐజీని ఆదేశించడంతో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



16 టన్నుల యూరియా పంపిణీ



దుకాణం వద్ద పెద్దఎత్తున గుమికూడిన రైతులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలానికి కేటాయించిన 16 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని ఓ ఎరువుల దుకాణానికి 16 టన్నుల యూరియా వచ్చింది. ఈ క్రమంలో వ్యవసాయ శాఖాధికారి నవీన్‌కుమార్ తహసీల్దార్ కార్యాలయం వద్ద పాసుపుస్తకాలు చూపిన రైతులకు ఒక్కో బస్తా యూరియా చొప్పున టోకెన్లు జారీ చేశారు. కాగా టోకెన్లు తీసుకున్న రైతులు పెద్దసంఖ్యలో ఎరువుల దుకాణం వద్దకు చేరుకోవడం, క్యూలో నిల్చోకుండా దుకాణం ఎదుట గుమికూడారు. తమకే ముందు యూరియా ఇవ్వాలని టోకెన్లు ఉన్న రైతులందరూ దుకాణంలోకి జొరపడేంత పనిచేశారు. దీంతో కొద్దిసేపు అక్కడ గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో టీడీపీ నేత జంగాల రమణ, మరికొందరు అక్కడికి వచ్చి రైతులను క్యూలో నిల్చోపెట్టి యూరియా పంపిణీకి సహకరించారు. కాగా ఎరువుల దుకాణం వద్దకు వచ్చిన సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత లేదని సీఎం చంద్రబాబు నుంచి కలెక్టర్ వరకు చెబుతున్నా, యూరియా కోసం రైతులు యుద్ధాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని తప్పుపట్టారు.

ఏడాదిలోపే క్రిటికల్ కేర్ బ్లాక్ పూర్తి చేస్తాం

- రూ.23.75 కోట్లతో నిర్మాణానికి భూమిపూజ
- మంత్రులు సత్యకుమార్‌యాదవ్, రాంప్రసాద్‌రెడ్డి



క్రిటికల్ కేర్ బ్లాక్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రులు సత్యకుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాదిలోపే 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని రాష్ట్ర ఆరోగ్య వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి వైద్యులు మంత్రులకు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 10 క్రిటికల్ కేర్ బ్లాక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా రెండు ఎమర్జెన్సీ వాహనాలను ప్రారంభించారు. ఆసుపత్రిలో రోగులను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. క్యాన్సర్ బాధితుల కోసం ఉచితంగా స్కానింగ్ పరీక్షలు నిర్వహించి మొదటి దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించేందుకు ఇక్కడ ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. కర్నూలులో 2018లో ప్రారంభించిన క్యాన్సర్ ఆసుపత్రిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులకు అధిక సంఖ్యలో రోగులు వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పులివెందులలో తప్ప మిగిలిన చోట వైద్యకళాశాలలు పునాదుల దశలోనే ఉన్నాయన్నారు. 2026-27లో పులివెందుల మార్కాపురం, ఆదోని, మదనపల్లి, రెండో విడతలో బాపట్ల, సామర్లకోట, పార్వతీపురంతో పాటు మిగిలినవి కళాశాలలో పూర్తి చేసి నాణ్యమైన వైద్య, విద్య, వైద్యసేవలను అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దామని తెలియజేశారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటిలో 50 పడకల ఆసుపత్రిని 100 పడకలు చేసేందుకు 35 సంవత్సరాలు పట్టిందని తెలిపారు. రాయచోటి ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరిగితే తిరుపతి, కడప, ఏలూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, మంత్రి సత్యకుమార్‌ను క్రిటికల్ కేర్ బ్లాక్ కావాలని కోరడంతో ఆయన స్పందించి మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి రాయచోటి నియోజకవర్గం తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి (చల్లాబాబు), టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాసరాజు, మైనార్టీ నాయకులు గాజుల ఖాదర్‌బాషా, పలువురు టీడీపీ మహిళా కార్యకర్తలు, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- 15 మంది స్మగ్లర్ల అరెస్ట్.. రెండు కార్లు సీజ్



పట్టుబడిన దుంగలు, స్మగ్లర్లతో అటవీశాఖ సిబ్బంది

వీరబల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సానిపాయి అటవీ పరిధిలో 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 15 మంది స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి రెండు కార్లను సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సాయిగిరిధర్, ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం గురువారం సానిపాయి ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. అప్పయ్యగారిపల్లె అటవీ ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలను కారులోకి లోడ్ చేస్తూ కనిపించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసు సిబ్బంది వారిని చుట్టుముట్టగా పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే వారిని వెంబడించి 15 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన వారు అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

అన్నమయ్య కలెక్టర్‌గా నిశాంత్‌కుమార్

- చామకూరి శ్రీధర్ బదిలీ



నిశాంత్‌కుమార్

రాయచోటి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను గురువారం రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసి ఆయన స్థానంలో ప్రస్తుతం ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నిశాంత్‌కుమార్‌ను నియమించింది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నిశాంత్‌కుమార్ 2014 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఈయన రాజస్థాన్ జోద్‌పూర్‌లోని ప్రముఖ నేషనల్ లా యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టాను పొందారు. 2013లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరై ఆలిండియా స్థాయిలో 416 ర్యాంకును సాధించి 24 ఏళ్ల వయస్సులోనే ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఈయనకు భార్య, ఒక కొడుకు ఉన్నారు. తొలుత పశ్చిమగోదావరిలో ట్రైనింగ్‌లో భాగంగా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత తిరుపతి సబ్‌కలెక్టర్‌గా, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం, మన్యం జిల్లా కలెక్టర్‌గా 2022 నుంచి 2024 వరకు పని చేశారు.

ప్రధానమంత్రి ఎక్స్‌లెన్స్ అవార్డు : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో రక్తహీనత, శిశు మరణాల రేటు, ప్రసూతి మరణాల రేటు తగ్గించడంలో ఆయన గణనీయమైన కృషికి గుర్తింపుగా ప్రధానమంత్రి ఎక్స్‌లెన్స్ అవార్డును పొందారు. కలెక్టర్‌గా 2022 నుంచి 2024 వరకు ప్రిజం-10 అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో అద్భుతమైన ఫలితాలు రావడంతో 2023 సంవత్సరానికి ఇన్నోవేషన్-డిస్ట్రిక్ట్ విభాగంలో ప్రధానమంత్రి ఎక్స్‌లెన్స్ అవార్డును గెలుచుకున్నారు.

చామకూరి శ్రీధర్ బదిలీ: 2024 జూలైలో చామకూరి శ్రీధర్ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలువైన రికార్డులను కాల్చివేసిన సమయంలో విధుల్లోకి వచ్చిన ఆయన సమర్థవంతంగానే పనిచేశారనే పేరుంది. వైసీపీ పాలనలో జిల్లాలో జరిగిన అనేక భూఅక్రమాలు వెలుగులోకి తెచ్చేందుకు ఈయన కృషి చేశారని అధికార వర్గాల్లో పేరుంది.

గుళికల మందు కొంటేనే యూరియా....!

- బస్తా యూరియా ధర రూ.800
- రైతులను దోచుకుంటున్న వ్యాపారులు



వ్యవసాయ శాఖాధికారులు రైతులకు పంపిణీ చేస్తున్న యూరియా



గుర్రంకొండలోని ఓ గోడౌన్‌లో ఉన్న యూరియా బస్తాలు

గుర్రంకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టించి కొందరు వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూరియా సరిపోకపోవడంతో కొందరు రైతులు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో గుళికల మందు కొంటేనే యూరియా ఇస్తామని అది కూడా అధిక ధరకు అమ్మి ఆ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రైతులు బస్తా యూరియాను రూ.800 చెల్లించి కొనుగోలు చేసే దుస్థితి నెలకొంది. రైతులు అధిక ధరకు కొనుగోలు చేసిన యూరియాకు వ్యాపారులు బిల్లులు ఇవ్వడం లేదు. రైతులు బిల్లులు ఇవ్వాలని అడిగితే తమ వద్ద యూరియా స్టాక్ లేదంటూ పంపేస్తున్నట్లు వాపోతున్నారు. దీంతో విధి లేని పరిస్థితిలో రైతులు అధిక ధరలకు యూరియాను కొనుగోలు చేసే దుర్భరస్థితి గుర్రంకొండలో నెలకొంది. ఒకవైపు జిల్లా అధికారులు ఎన్ని హెచ్చరికలు జారీ చేస్తున్నా వ్యాపారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా రైతులను దోచుకుంటున్నారు. ఇటువంటి వ్యాపారులపై అధికారులు నిఘా పెట్టి వారి ఆగడాలను అరికట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

గుర్రంకొండ మండలంలోని 15 పంచాయతీల్లో ప్రస్తుతం 7 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఈ రైతు సేవా కేంద్రాలకు యూరియాను తెప్పించి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కొక్క రైతు సేవా కేంద్రానికి 222 బస్తాల చొప్పున స్టాక్‌ను తెప్పించి పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలానికి ఇప్పటి వరకు సుమారు 1110 బస్తాల యూరియా రైతు సేవా కేంద్రాలకు చేరాయి. ఈ యూరియాను అధికారులు రైతులకు ఒక్కొక్క బస్తా చొప్పున అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఓ బస్తా యూరియా పంటలు సాగు చేసిన రైతులకు సరిపోవడం లేదు. దీంతో రైతులు యూరియా కోసం ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు యూరియాను డబుల్ రేట్లకు అమ్ముతున్నారు. మండలంలోని ఎల్లుట్లకు చెందిన రైతు ఆనంద్ మంగళవారం గుర్రంకొండలోని ఓ ఎరువుల దుకాణం వద్దకు వెళ్లి మూడు బస్తాల యూరియా కావాలని వ్యాపారిని అడిగాడు. అయితే వ్యాపారి మూడు బస్తాల యూరియా కావాలంటే రూ.2400 చెల్లించాలని చెప్పినట్లు రైతు చెబుతున్నాడు. దీంతో అధిక ధర చెల్లించలేని రైతు యూరియాను కొనుగోలు చేయలేక ఇంటికి తిరిగివెళ్లాడు. అలాగే సరిమడుగుకు చెందిన రైతు విజయేంద్ర గురువారం యూరియా కొనుగోలు చేయడానికి గుర్రంకొండకు వచ్చాడు. ఈ క్రమంలో ఓ దుకాణంలో యూరియా కావాలని అడిగాడు. దీంతో వ్యాపారి గుళికల మందు కొంటేనే యూరియా ఇస్తానంటూ రైతుకు తేల్చి చెప్పాడు. దీంతో రైతు యూరియా ధర ఎంతని అడగగా 10 కిలోల గుళికల మందు, రెండు బస్తాల యూరియాకు రూ.1300 వ్యాపారి తీసుకున్నట్లు చెప్పాడు. ఇలా గుర్రంకొండలో వ్యాపారులు యూరియాను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తునట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గుర్రంకొండలో ఇద్దరు వ్యాపారులు మాత్రమే యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రైతులు చర్చించుకొంటున్నారు. అధికారులు అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్న వ్యాపారుల వివరాలను సేకరించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ ధరకే విక్రయించాలి

ఎరువుల దుకాణాల వ్యాపారులు యూరియాను ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్రయించాలి. అలా కాకుండా వ్యాపారులు అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు యూరియా కొనుగోలుదారులకు అదనంగా ఇతర ఎరువులను అమ్ముతున్నట్లు తెలిసింది. అలాంటి ఎరువుల దుకాణాల వ్యాపారుల వివరాలను సేకరించి లైసెన్స్‌ల రద్దుకు జిల్లా అధికారులకు నివేదిక పంపుతాం.

- రత్నమ్మ, వ్యవసాయశాఖ అధికారిణి, గుర్రంకొండ.

అతిగా వాడితే అనర్థమే..!

- సమతుల్య ఎరువుల వాడకం కీలకం
- అతిగా యూరియా వాడకంతో దెబ్బతింటున్న భూసారం
- ఎరువుల అతి వినియోగంతో ఆర్థిక భారం
- సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి



వరిలో కలుపు తీస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన అధిక దిగుబడులకు సమతుల్య ఎరువుల వాడకం కీలకం. ఎంత ఎరువు వాడితే పంటకు అంత బలం అనే అపోహ చాలామంది రైతుల్లో ఉంది. మోతాదుకు మించి ఎరువులు, పురుగుల మందుల వాడకం పంటలకు బలం కాదు.. భూసారాన్ని తగ్గించేసి దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట వరి. అవసరం మేరకు విడతల వారీగా ఎరువులు తీసుకోవడం కాకుండా ఒకేసారి సమీకరించుకోవాలనే తాపత్రయం, వ్యాపారుల లాభాపేక్ష వెరసి యూరియా కొరతకు కారణమవుతోంది. మన పూర్వీకులు పొలం గట్లపై ఉండే కానుగ, వేప, జిల్లేడు, వెంపలి, అవిశ చెట్ల పచ్చి ఆకు కొట్టి తెచ్చి కలియ దున్నడం, పశువుల ఎరువు వంటి సహజ వనరులపై ఆధారపడేవారు. దురదృష్టవశాత్తు తగినంత పశువుల ఎరువు అందుబాటులో లేనందున రైతులు కృత్రిమ ఎరువులు ప్రధానంగా యూరియాపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలలో సమతుల్య ఎరువుల వినియోగం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రధానంగా నత్రజని అందించే యూరియా సమతుల్యంగా వినియోగించడం చాలా ముఖ్యం.

అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల భూసారం క్రమంగా తగ్గిపోతుంది. భూగర్భ జలాలు, నీటి వాగులు కలుషితం అవుతాయి. పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుంది. సాగు ఖర్చులు పెరిగి లాభం తగ్గుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

యూరియా తగ్గించే ప్రత్యామ్నాయాలు

పశువుల ఎరువు, వర్మీ కంపోస్టుతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పొలం గట్లపై ఉండే కానుగ, వేప, అవిశ చెట్ల పచ్చి ఆకులు వేసి కలియ దున్నడం, సీజను వర్షానికి ముందు పొడి విత్తనాలు చల్లడం, పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం, పంట అవశేషాలను కలియ దున్నడం ద్వారా తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా నత్రజనిని పంటకు అందించవచ్చు. అలాగే జీవన ఎరువులైన అజటో బ్యాక్టర్, అజోస్పరిల్లం, రైజోబియం వినియోగించడం వలన పంటలకు తక్కువ ఖర్చుతో నత్రజని లభ్యత, భూసారం పెంచవచ్చు. ఈ విధానం ద్వారా 20 నుంచి 25 శాతం నత్రజని ఆదా చేయవచ్చు.

కొత్త తరహా ఎరువుల వాడకం....

నానో యూరియాను పైపాటుగా పంట కాలంలో రెండు మూడు దఫాలుగా పిచికారీ చేయడం వలన 80 శాతం నత్రజని లభ్యత పెంచడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూ దిగుబడిలో ఎటు వంటి తగ్గుదల ఉండదు.

పీలేరులో ఖరీఫ్ సాగు...

నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వరి, వేరుశనగ పంటల సాగు విస్తీర్ణం హెక్టార్లలో ఇలా ఉన్నాయి. పీలేరు మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 355 హెక్టార్లకు గాను 180 హెక్టార్లలో సాగు చేశారు. వేరుశనగ 1826.8 హెక్టార్లకు గాను 210 హెక్టార్లలో సాగు చేశారు. కేవీ పల్లె మండలంలో వరి 370 హెక్టార్లకు 120 హెక్టార్లు, వేరుశనగ 2619 హెక్టార్లకు కేవలం 172 హెక్టార్లలో సాగు చేశారు. వాల్మీకిపురం మండలంలో వరి 578 హెక్టార్లకు గాను 2.33, వేరుశనగ 1392 హెక్టార్లకు 86.62 హెక్టార్లలో సాగు చేశారు.

గుర్రంకొండ మండలంలో వరి 343 హెక్టార్లకు 39.07, వేరుశనగ 916 హెక్టార్లకు గాను 35.83 హెక్టార్లలో సాగు చేశారు. కలికిరి మండలంలో వరి 416 హెక్టార్లకు గాను 75.72, వేరుశనగ 1100 హెక్టార్లకు 52.33 హెక్టార్లలో సాగు చేశారు. కలకడ మండలంలో వరి 229 హెక్టార్లకు 22.77, వేరుశనగ 986 హెక్టార్లకు 44.14 హెక్టార్లలో సాగు చేశారు. ఇవి కాక అరకొరగా కూరగాయలు, టమోటా, బొప్పాయి, పశుగ్రాసం రైతులు సాగు చేశారు.

వరి ఎకరాకు వేయాల్సిన ఎరువులు...

ఒక ఎకరా వరి పంట సాగు చేస్తే రైతులు 75 కిలోల యూరియాను మూడు దఫాలు సమాన మోతాదులో పిచికారీ చేయాలి. డీఏపీ, గ్రోమోర్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 40 కిలోలు ఒకసారి మాత్రమే వేయాలి. పొటాష్ 30 కిలోలు దమ్ములో 15 కేజీలు, చిరు పొట్ట దశలో 15 కిలోలకు వాడాలి. అయితే వాటికి రెండు, మూడింతలు ఎరువులు వినియోగిస్తున్నట్లు అధికారులు, శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అధిక మొత్తంలో ఎరువుల వాడకం పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

వరి పంటకు మేలు కంటే కీడే ఎక్కువ....



రసాయన ఎరువుల వినియోగం వరి పంటకు మేలు కంటే కీడు ఎక్కువ చేస్తుంది. ఎరువుల అతి వినియోగంతో ఆర్థిక భారమే కాకుండా తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గే అవకాశముంది. భూసారం దెబ్బతింటుంది. కొందరు రైతులు సహజసిద్ధ పద్ధతుల్లో కషాయాల వినియోగంతో పెట్టుబడులు తగ్గించుకోవడమే కాకుండా భూసారాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. యూరియా అధిక మోతాదులో వాడకం వల్ల అనేక నష్టాలను చవిచూసే ప్రమాదం ఉంది. నత్రజని అందించే యూరియా ఎరువు సమతుల్యంగా వినియోగించడం చాలా ముఖ్యం.

- వైవీ రమణరావు, ఏడీఏ, పీలేరు.

ఎకరాకు రూ.35 వేలకు పైగా ఖర్చు



ఒక ఎకరా వరి పంట సాగుకు రూ.35 వేలకు పైగా ఖర్చు వస్తోంది. సకాలంలో ఎరువులు, కలుపు తీత తదితర పనులు పూర్తి చేస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల దిగుబడి ఉంటుంది. అయితే అనేక కష్టనష్టాలకు ఓర్చి పంట చేతికందే సమయానికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యూరియా కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. రైతుల ఇక్కట్లు గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- చిన్నయల్లప్ప, రైతు, కురవపల్లె, పీలేరు మండలం.

ప్రభుత్వ భూములు పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు చల్లా కళ్యాణి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం రెడ్డికోటకు సమీపంలోని పర్లగోళ్లపల్లె వద్ద ఏపీఐఐసీకి కేటాయించిన ప్రభుత్వ భూములను గురువారం సబ్‌కలెక్టరు చల్లా కళ్యాణి అధికారులతో కలసి పరిశీలించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి గతంలో రెడ్డికోట వద్ద 20 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే రోడ్డున పడతామని స్థానిక రైతులు సబ్‌కలెక్టరు ఎదుట వాపోయారు. స్పందించిన సబ్‌కలెక్టరు బాధిత రైతుల వద్ద ఉన్న భూమి పాసుపుస్తకాలను పరిశీలించారు. భూమికి సంబంధించి రైతుల వద్ద ఉన్న ఆధారాలు (భూమి పాసుపుస్తకాలు, ఇతర రికార్డులు), తమ వద్ద (రెవెన్యూ కార్యాలయంలో) ఉన్న రెవెన్యూ రికార్డులు తీసుకుని మదనపల్లెలోని కార్యాలయానికి రావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ధనుంజయులు, మండల సర్వేయరు నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు



స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గాలివీడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి యూరియాను వాడరాదని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామంలో డీపీఎం వెంకటమోహన్‌తో కలిసి యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని, భూమి సారవంతాన్ని పెంచి అధిక దిగుబడులు ఇచ్చేలా ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అనంతరం యూరియా స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో నవంత్, మండల వ్యవసాయ అధికారిణి గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

లోను ఇప్పిస్తామని నమ్మించి మహిళపై దాడి

బంగారు నగల అపహరణ



గాయపడిన రమాదేవి

పుల్లంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళకు లోను ఇప్పిస్తామని నమ్మించి ఆపై దాడి చేసి బంగారు నగలతో ఉడాయించిన ఘటన మండలంలోని వత్తలూరు పంచాయతీలో జరిగింది. పుల్లంపేట ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. మండల పరిధిలోని వత్తలూరు వడ్డిపల్లెకు చెందిన ఏరుకాలువ రమాదేవి (56) రాజంపేటలో నివాసం ఉంటోంది. ఈమె భర్త, కుమారుడు కువైత్‌లో ఉన్నారు. ఒక కుమార్తె రాజంపేటలో ఉండగా మరో కుమార్తె రైల్వేకోడూరులో ఉంటోంది. వడ్డిపల్లె అరుంధతివాడలో ఓ మహిళకు రమాదేవి కొంత నగదు అప్పుగా ఇచ్చింది. ఆమె పెనగలూరు మండలంలో ఉండడంతో వారం క్రితం ఆమె దగ్గరకు వెళుతుండగా ఒక యువకుడు పరిచయమయ్యాడు. ఆమె ఫోన్ నెంబరు తీసుకుని తన ఇంటికి, తన కుమార్తె ఇంటికి వస్తూ ఫోన్ చేస్తూ మీకున్న పొలానికి లోను ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో రమాదేవి బుధవారం సాయంత్రం ఆ యువకుడిని తన పొలం వద్దకు తీసుకెళ్లింది. అనంతరం పొలం దగ్గర ఉన్న తిప్పపైకి రమాదేవిని తీసుకెళ్లి కిందకు తోసేశాడు. అంతటితో ఆగకుండా ఆమె తలపైన, ఒళ్లంతా రాళ్లతో కొట్టడంతో ఆమె చంపేస్తాడేమోనని స్పృహ తప్పినట్లు పడిపోయింది. దీంతో ఆ యువకుడు ఆమె మెడలోని తాళిబొట్టు సరుడు, కమ్మలు లాక్కెళ్లినట్లు ఎస్‌ఐ వివరించారు. బంధువుల సహాయంతో ఆమె తిరుపతిలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో చికిత్స పొందుతోంది. ఆమె ఇచ్చిన ఫోన్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నాగేంద్ర (ఫైల్)

రామాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కూలి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా... మండలంలోని రాచపల్లి పంచాయతీ వడ్డెపల్లెకు చెందిన కుంచపు నాగేంద్ర (33) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఎక్కువై దిక్కుతోచని స్థితిలో బుధవారం పొద్దుపోయాక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి కుంచపు వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని శవపరీక్షకై రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, శవపరీక్ష అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య హితం



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న రైతులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యకరమని పోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ అన్నారు. గురువారం గుండ్లపల్లె రైతులతో కలిసి పోర్డు సంస్థ ప్రతినిధులు అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సహకారంతో కడప జిల్లా పొద్దుటూరు సమీపంలోని కల్లూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి సేద్యంతో పంటల సాగు, పెట్టుబడి, పండించిన పంటలు, జీవన ఎరువులు, జీవామృతంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి తదితర అంశాలపై సీఎస్ఆర్ సంస్థ ప్రతినిధులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ డైరెక్టర్ ఆదినారాయణ, అభిషేక్, పవన్‌కుమార్, పోర్డు ప్రతినిధులు రమణ, సంపూర్ణ, హేమంత్, అనిత, నరసింహులు, రైతులు వేట మల్లికార్జున, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్‌లో చోరీ

- 13 తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీ

పెనగలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వినాయకనగర్‌లోని డేరంగుల జయమ్మ ఇంట్లో చోరీ జరిగి 13 తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ బి.రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ చోరీ పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ ఆధ్వర్యంలో రాయచోటి నుంచి వేలిముద్రల సేకరణ బృందం సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితురాలు జయమ్మ గత ఆదివారం కడపలోని తన సోదరి దగ్గరకు వెళ్లారు. బుధవారం సాయంత్రం తిరిగి పెనగలూరు వినాయకనగర్‌లోని ఇంటికి చేరుకోగానే ప్రధాన తలుపులు బార్ల తెరిచి ఉండడంతో హుటాహుటిన ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూం తలుపులు పగులగొట్టి ఉండడంతో కంగారుపడ్డారు. బీరువా వైపు చూడగా బీరువా తలుపులు కూడా పగులగొట్టి అందులోని బంగారు, నగదుతో పాటు వెండి గొలుసులు, పూజగదిలోని జత వెండి దీపాలు కూడా అపహరించుకు పోయినట్లు తెలిపారు. దోపిడీ జరిగినట్లు గుర్తించిన జయమ్మ హుటాహుటిన బంధువుల సహకారంతో పెనగలూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు నగదు చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ప్రజలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ ప్రజలకు సూచించారు. విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో దాచుకుంటే భద్రంగా ఉంటుందన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనుల పరిశీలన



ఆలయం వద్ద అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్, తదితరులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నగల్లు గ్రామంలో పురాతన చెన్నకేశవస్వామి జీర్ణోద్ధరణ పనులను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ఇటీవల దేవదాయ రూ.40 లక్షలతో కొత్తగా ఆలయాన్ని నిర్మిస్తుండడంతో ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. కాగా గ్రామస్తులు ఆలయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని దేవదాయ శాఖ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయించి ఆలయాన్ని ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు చంద్రమోహన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రమణ, కేశవ, వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వన్‌బీ అడంగల్‌ను పునరుద్ధరించాలి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దేవదాయ భూములకు సంబంధించి దేవుడి మాన్యం భూములకు వన్‌బీ అడంగల్‌ను పునరుద్ధరించాలని పెద్దతిప్పసముద్రం తహసీల్దార్‌ను అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ కోరారు. ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆలయ భూములకు సంబంధించి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయ భూములు 26.87 సెంట్ల భూమికి వన్‌బీ అడంగల్ ఇతరుల పేర్లతో నమోదయ్యాయని, వ్యక్తుల పేర్లను తొలగించి దేవుని గుడి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరడంతో దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తహసీల్దార్ ఆయనకు తెలిపారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా ఎయిడ్స్ లెప్రసీ అధికారి రమేష్ అన్నారు. గురువారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందితో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ కేసులు నమోదు చేసి రిజిస్ట్రేషన్ తప్పక చేయాలన్నారు. కళాశాలల్లో, హైరిస్క్ ప్రాంతాల్లో క్యాంపెయిన్ చేయాలన్నారు. ఐసీటీసీ, ఏఆర్టీ కేంద్రాల్లో సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డేవిడ్ భాస్కర్, కౌన్సిలర్లు జయకుమార్, చంద్రమోహన్, పుల్లయ్య నాయుడు, దీప్తి, పాల్గొన్నారు.

భళా.. కళా ఉత్సవ్

డైట్ కేంద్రంలో ఘనంగా ప్రారంభమైన కళా ఉత్సవ్ పోటీలు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం



కళా ఉత్సవ్ పోటీల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని కళాత్మక ప్రతిభను వెలికి తీసేందుకు ఉద్దేశించిన కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు గురువారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడం, కళల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు విద్యార్థులకు వేదికను అందించడం, ప్రాంతీయ స్థాయిలో కళలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, కథాకథనం పోటీల్లో 47 పాఠశాలల నుంచి 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతి విభాగంలో పోటాపోటీగా తమ ప్రతిభను ప్రదర్శించారు. కళా ఉత్సవ్‌లో విద్యార్థులకు కళా నైపుణ్యాలకు సంబంధించి ఆరు విభాగాల్లో 12 అంశాల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారిని జిల్లా స్థాయి కళాఉత్సవ్ విజేతలుగా ప్రకటిస్తామని కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం న్యాయ నిర్ణేతగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత ప్రముఖ రచయిత డాక్టర్ వేంపల్లి గంగాధర్ వ్యవహరించారు. ఈఅ సందర్భంగా బాలికలు చేసిన నృత్యం ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, కళాకారులు స్వతంత్ర బాబు, డైట్ అధ్యాపకులు, ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలు



బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్

రాజంపేటటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదల కోసం సబ్సిడీ బియ్యాన్ని అందజేస్తుందని, దాన్ని అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు రవికుమార్ తెలిపారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా ప్రభుత్వ బియ్యం తరలించకుండా పలు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపట్టారు. డీలర్ల వద్ద ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. రాజంపేట, నందలూరు, పుల్లంపేట, పెనగలూరు ప్రాంతాల్లోని డీలర్లకు అధునాతనమైన 139 ఈ పాస్ యంత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. వీటివల్ల లబ్ధిదారులకు తలెత్తుతున్న ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

వై.కోటలో చిన్నారి మృతి



చందన (ఫైల్)

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వై.కోట గ్రామానికి చెందిన అంకిపల్లి విజయ్, రాజేశ్వరి దంపతుల కుమార్తె చిన్నారి చందన (8) గురువారం మృతి చెందింది. గ్రామ పరిధిలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఈ చిన్నారి మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు గల్ఫ్‌కు వెళ్లడంతో పెద్దనాన్న వద్ద ఉంటోంది. రోజూలాగే ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లింది. అనంతరం ఏమైందో గానీ 10 గంటలకు వాంతులు చేసుకోగా గమనించిన ప్రధానోపాధ్యాయుడు మహదేవ సిబ్బందితో కలిసి చిన్నారి ఇంటికి తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అనంతరం పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చిన పాప పెద్దనాన్న రైల్వేకోడూరులోని ఓ ఆసుపత్రికి తరలించే క్రమంలో వైకోట బస్టాప్ వద్ద ఆ చిన్నారికి ఫిట్స్ వచ్చాయని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే కోడూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించి మెరుగైన వైద్య చికిత్స కొరకు తిరుపతికి తరలిస్తుండగా చిన్నారి మృతి చెందినట్లు వారు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భోరున విలపించారు. శుక్రవారం ఉదయం గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వస్తున్నట్లు తెలిసింది.

పేరుకే...50 పడకల ఆసుపత్రి

- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యం అందక రోగుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో దుస్థితి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేరుకే అది 50 పడకల ఆసుపత్రి. ఇక్కడకు ప్రతి నిత్యం వందల మంది రోగులు వస్తుంటారు. అయితే డాక్టర్ల కొరత కారణంగా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి రోగులకు వైద్యసేవలు అందించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...

పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాలకు ప్రధాన కేంద్రం. ఈ మండలాల గ్రామీణ ప్రజలు వైద్యసేవలు పొందాలన్నా, చిన్న ప్రమాదం జరిగినా ముందుగా ఈ ఆసుపత్రిని ఆశ్రయిస్తారు. దీంతో ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా 30 పడకలతో ఉన్న ఆసుపత్రిని 2019లో 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.3కోట్లు నిధులు వెచ్చించి భవనాలు నిర్మించి 50 పడకల ఆసుపత్రిగా మార్చి ఆధునిక పరికరాలన్నీ ఏర్పాటు చేసి 2023లో ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్ల నియామకం చేపట్టపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీనిపై పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డాక్టర్ల కొరతతో ఇక్కట్లు

పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నిత్యం 200 నుంచి 300 మంది వివిధ రకాల వ్యాధిగ్రస్తులు ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. అయితే ఇక్కడ డాక్టర్ల కొరత తీవ్ర సమస్యగా మారింది. 12మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా మొన్నటి వరకు ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇటీవల మరో ఇద్దరు జాయిన్ కావడంతో ఆ సంఖ్య ఐదుగురికి చేరింది. ఇక గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, ఈఎన్టీ, మత్తు డాక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఉన్న డాక్టర్లు డెప్యుటేషన్‌పై వెళ్లడం, కొత్తవారు ఈ ప్రాంతానికి రావడానికి సుముఖంగా లేకపోవడం వైద్యుల కొరతకు కారణమైంది. ఇక ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతుండడంతో రక్త పరీక్షలకు వచ్చేవారు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందికరంగా ఉంది. అంతేకాక నైట్ సెక్యూరిటీ గార్డు పోస్టు నియామకం చేపట్టాల్సి ఉంది. ఇక ఆసుపత్రిలో అత్యవసర వేళల్లో రక్తం అందించడానికి బ్లడ్ స్టోరేజీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక నెల నుంచి ఉపయోగంలో లేదని తెలిసింది. ఇందుకు సంబంధించి లైసెన్సు రెన్యువల్ కావాల్సి ఉంది. దీంతో ఈ నాలుగు మండలాలకు సంబంధించిన ప్రజలు వైద్య సేవలు అందక ఇబ్బందులకు గురవతున్నారు. దీనిపై గతంలో జిల్లాస్థాయి వైద్యశాఖా ధికారులు ఈ హాస్పిటల్‌ను తనిఖీ చేసేందుకు వచ్చినప్పుడు వైద్యుల నియామకం జరపాలని కోరారు. అలాగే సమస్యను ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్య వైద్యాశాఖాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి సక్రమంగా వైద్యసేవలు అందించాలని పోరుమామిళ్ల ప్రాంతవాసులు కోరుతున్నారు.


పోరుమామిళ్లలోని సామాజికఆరోగ్యకేంద్రం

వైద్యుల పోస్టులు భర్తీ చేస్తే...

తాను బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు అవుతుంది. ప్రస్తుతం ఉన్న డాక్టర్లతోనే వైద్యసేవలు అందిస్తున్నాం. ఖాళీగా ఉన్న పోస్టులకు వైద్యుల నియామకం జరిగితే పూర్తిస్థాయిలో సేవలందించేందుకు వీలుగా ఉంటుంది.

-నాగలక్ష్మి, సూపరింటెండెంట్,
పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం



రక్తపరీక్షల కోసం నిరీక్షిస్తున్న వ్యాధిగ్రస్తులు, వైద్యం కోసం వచ్చిన రోగుల అవస్థలు

కోడిగాండ్లపల్లెలో జ్వరాలపై రిమ్స్ వైద్యుల బృందం ఆరా


వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న రిమ్స్ రాపిడ్ రెస్పాన్స్‌టీం

ముద్దనూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కోడిగాండ్లపల్లెలో గురువారం రిమ్స్ మెడికల్ కాలేజీ రాపిడ్ రెస్పాన్స్ టీం పర్యటించింది. విషజ్వరాలతో బాధపడుతున్న బాధితుల ఇళ్ల వద్దకు రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, సామాజిక వైద్య విభాగం డాక్టర్ సురేష్‌రెడ్డి, ప్రొఫెసర్లు నవాజ్, ఖలీల్, కిశోర్‌రెడ్డి బృందం వెళ్లి పూర్తి వివరాలు ఆరాతీశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు బ్యాక్ వాటర్ వల్ల దోమలు విపరీతంగా వస్తున్నాయని బృందం సభ్యులకు వివరించారు. దీంతో గ్రామ సమీపంలో నిల్వ ఉన్న గండికోట బ్యాక్‌వాటర్‌ను బృందం పరిశీలించింది. అనంతరం మెడికల్ క్యాంప్ వద్ద ఆరోగ్య పరీక్షలు చేశారు. 35 మంది రక్తన మూనాలను సేకరించారు. ఎలిషా పరీక్ష కోసం డెంగ్యూ అనుమానిత ఐదుగురి రక్త నమూనాలను రిమ్స్‌కు తీసుకెళ్లారు. జ్వరాలు తగ్గేంత వరకు గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామని మెడికల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్‌యూనిట్ అధికారి లక్షుమయ్య, ముద్దనూరు, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చిలమకూరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్‌వాటర్, పారిశుధ్యంతోనే సమస్య

కోడిగాండ్లపల్లెలో డెంగ్యూ ప్రబలేందుకు గ్రామంలో పారిశుధ్య లోపం, ప్రధానంగా బ్యాక్‌వాటర్‌తో సమస్యగా ఉంది. గ్రామ సమీపంలో బ్యాక్ వాటర్ నిలిచి ఉన్నందున విపరీతంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దీంతో రాబోవు రోజుల్లో మరింత ప్రమాదకరమైన విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. రక్త నమూనాలను సేకరించి పరీక్షల అనంతరం పూర్తి నివేదిక జిల్లా అధికారులకు అందజేస్తాం.

-డాక్టర్ సురేష్‌రెడ్డి, రిమ్స్ వైద్యశాల సామాజిక వైద్య విభాగం, కడప

ఉత్సాహంగా సాగిన ఎస్‌జీఎఫ్ క్రీడలు


బాక్సింగ్‌లో ఎంపికైన బాలికలతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడలకు సంబంధించి నిర్వహించిన ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ జగన్నాథరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఇందులో ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్ విభాగాల క్రీడలలో ఉమ్మడి కడప జిల్లా నుంచి పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి వెల్లడించారు. ఇందులో అండర్-19 విభాగంలో ఎంపికైన బాలబాలికల వివరాలిలా...

బాలికల స్విమ్మింగ్ విభాగంలో....: ఎం.కుసుమ (వేము ల) పి.మంజు (సంబేపల్లి) ఎ.లావణ్య (వేముల) కె.కావ్య (సంబేపల్లి), కె.షీనా (చిన్నమండెం)

బాలుర స్విమ్మింగ్ విభాగంలో...: జి.అరవింద్‌కుమార్ (గాలివీడు), ఎ.దినేష్‌కుమార్ (కమలాపురం), టి.చిన్నగంగరాజు (రాజంపేట), ఎ.దినేష్‌కుమార్ (కమలాపురం), జె.వనిష్‌వర్ధన్ (సిద్దవటం), వై.వరజ్ (రామనపల్లి), జె.శ్రీశాంత్ (కడప), కె.కార్తీక్ (గాలివీడు) ఎ.ప్రకాష్ (గాలివీడు), పీవీ దస్తగిరి (లక్ష్మీపేట), ఎస్.తిరుమలయ్య (రామనపల్లి), పి.సూర్యచరణ్‌తేజ (లక్ష్మీపేట), జి.గణేష్‌రెడ్డి (సి.కె.దిన్నె), ఎస్.మాధవ (కమలాపురం), జి.కార్తీక్ (రామనపల్లి), కె.చెన్నయ్య (రాజంపేట), ఎస్.శ్రీహర్ష (రాజంపేట)

బాక్సింగ్ బాలుర విభాగంలో...: జె.వంశీవర్ధన్ (46కేజీ), జి.జయకృష్ణ (46 కేజీ), ఎస్.హుస్సేన్ (46-49 కేజీ), వి.రాధాకృష్ణ (49-52 కేజీ), కె.లోకేష్ (52-60కేజీ) ఎం.జయ ప్రకాష్ (60-64కేజీ), కె.వంశీ (91 కేజీ)

బాలికల విభాగంలో...: ఎస్.శిరీషా, ఎం.శృతి (45కేజీ) డి.లక్ష్మీప్రసన్న (45-48కేజీ) కె.నవ్య, పి.మంజు (48-51కేజీ) వి.కృష్ణకావ్య, డి.మహాలక్ష్మీ (51-54కేజీ), ఎ.భువనేశ్వరి, వి.చైతన్యలక్ష్మి (54-57కేజీ) ఎన్.వెంకటేశ్వరి (57-60కేజీ) డి.యామిని (60-64కేజీ), వి.మోనిక (64-66కేజీ), ఓ.హిమశైలజ (69-75కేజీ)

మోడరన్ పెంథలాన్ బాలురు : ఎస్.తిరుమలయ్య (రామనపల్లి) సి.రామ్‌చరణ్ (కొత్త మాధవరం), కె.సంజయ్ (రాజంపేట), కె. చెన్నయ్య (రాజంపేట), ఎన్.శివసాయి (రామనపల్లి)

బాలికల విభాగంలో...: జి.నాగచరిత (రామాపురం) డి.మహాలక్ష్మి (రామాపురం), కె.కావ్య (సంబేపల్లి), ఎన్.నాగమణి (రామనపల్లి)

బంగారు గొలుసు దొంగ అరెస్టు

సీకేదిన్నె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడివీధిలో వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దొంగతనం చేసిన కాకర్ల ఆకాష్‌ను అరెస్టు చేసినట్లు సీకేదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. నందలూరు మండలం నల్లతిమ్మయ్యగారిపల్లెకు చెందిన ఎర్రగోళ్ల లక్షుమ్మ ఈనెల 9న అంగడివీధిలో నడుచుకుంటూ వెళుతుండగా ఆమె మెడలో ని 20 గ్రాముల బంగారు గొలుసును బలవంతంగా లాక్కుపోయాడు. గురువారం నిందితుడి ఆచూకీ తెలుసుకుని సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి రూ.1.60 లక్షలు విలువచేసే బంగారు చైను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు ప్పవారిపల్లె గ్రామానికి చెందిన ఆకాష్ స్టూడెంట్‌గా చదువుకుంటూ వ్యసనాలకు బానిసయ్యాడు. ఇంటిలోని వారికి చెప్పకుండా అప్పులు చేసి వాటిని తీర్చేందుకు చెడుమార్గాన్ని ఎంచుకుని జైలుపాలైనట్లు సీఐ తెలిపారు.

వీధి కుక్కల దాడి... చిన్నారికి గాయాలు

కలసపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక టైలర్ కాలనీలో గురువారం సాయంత్రం వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి ఇమ్రాన్ గాయపడ్డాడు. ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా తమబిడ్డపై దాడి చేశాయని తల్లిదండ్రులు మౌళాలి, వహీదాలు తెలిపారు. తాము దగ్గరలో లేకపోయింటే పిల్లాడి పరిస్థితి ఎలా ఉండేదో అని వాపోయారు. ఇమ్రాన్‌కు పోరుమామిళ్లలో చికిత్స చేయించినట్లు తెలిపారు. వీధికుక్కలను అదుపుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటి సామాగ్రి దగ్ధం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాధాక్రిష్ణనగర్‌కు చెందిన సుబ్రమణ్యం అనే వ్యక్తి ఇంట్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు, టీవీ, ఫ్రిజ్, ఏసీ తదితర పరికరాలు కాలిపోయాయి. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

కడప జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా సతీష్

కలికిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఉద్యానశాఖ అధికారిగా జి.సతీష్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉద్యానశాఖ సహాయ సంచాలకులుగా వున్న సతీష్. ప్రస్తుతం తిరుపతి ఏపీఎంఐపీ (సూక్ష్మ నీటిపారుదల) ప్రాజెక్ట్ డైరెక్టరుగా పనిచేస్తున్నారు. పదోన్నతి కల్పించిన కారణంగా ఆయన్ను బదిలీ చేసి కడప ఉద్యానశాఖ డీడీగా తాత్కాలికంగా నియమించారు. కాగా ప్రస్తుతం ఉద్యానశాఖ సహాయ సంచాలకులుగా వున్న ఎం.వెంకటేశ్వరరెడ్డి కడప జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తున్నారు. ఆయనకు కూడా ఉద్యానశాఖలో డీడీగా పదోన్నతి కల్పించి డెప్యుటేషన్ పద్ధతిలో తిరిగి ఏపీఎంఐపీ పీడీగానే నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాయిబాబా స్కూల్‌కు జాతీయ గుర్తింపు



అవార్డు స్వీకరిస్తున్న సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ వివాంటా (ద్వారకా) 7 స్టార్ హోటల్‌లో జరిగిన సి-ఫోర్ స్కూల్ ఎక్సలెంట్ అవార్డ్ కార్యక్రమంలో సాయిబాబా హైస్కూల్ జాతీయ స్థాయిలో బెస్ట్ బడ్జెట్ స్కూల్స్ విభాగంలో 12వ ర్యాంక్ సాధించింది. ఈ అవార్డును మాజీ సీబీఐ డైరెక్టర్ డాక్టర్ కార్తికేయన్, ఐఏఎస్ అధికారి కె.శివప్రసాద్ చేతులమీదుగా సాయిబాబా విద్యాసంస్థల వైస్‌చైర్మన్ ఎంవీ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాల విజయాన్ని అభినందించి ఇంకా ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు.

భారీ స్కోర్ దిశగా కర్నూలు... నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య గురువారం నుండి జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్లు తలపడుతున్నాయి. ఇందులో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 57 ఓవర్లలో 3వికెట్లు మాత్రమే కోల్పోయి 222 పరుగులు చేసింది. ఇందులో ఎం. నయాముల్లా 107 పరుగులు చేయగా, సాయిగణేష్ 57 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లోనెల్లూరు జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 407 పరుగల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోషన్ పవన్ ఏకంగా 226 పరుగులతో , సుతేజ్‌రెడ్డి 89 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

'యోగి వేమన' స్టాండింగ్ కౌన్సెల్ రాజీనామా ఆమోదం

కలికిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప యోగి వేమన యూనివర్శిటీ స్టాండింగ్ కౌన్సెల్‌గా గతంలో నియమించిన టి.నిరంజన్ తన పదవికి చేసిన రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం యూనివర్శిటీ తరఫున ఆయన రాష్ట్ర హైకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్‌గా వ్యవహరిస్తున్నారు. అడ్వకేట్ జనరల్ సూచనల మేరకు నిరంజన్ రాజీనామాను తక్షణం అమల్లోకి వచ్చే విధంగా ఆమోదిస్తున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి గురువారం ఆదేశాలు జారీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ
జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు వారి కార్యాలయము, కడప.
స్టేజి- II టెండరు ప్రకటన
నెం. పి.డి.యస్. 2/Movt/St-2/2025-27 తేది : 10-09-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, వై.యస్.ఆర్. కడపజిల్లా వారు బియ్యము, కందిపప్పు, పంచదార, పామాయిల్ మరియు ప్రభుత్వము వారు నిర్ణయించి నట్టి ఇతర నిత్యావసర వస్తువులను వై.యస్.ఆర్. కడపజిల్లాలోని 1. కడప మరియు 2. పులివెందుల మండలస్థాయి గోదాములునుండి ఆయా మండలస్థాయి గోదాములకు అనుసంధించిన మండలములలోగల చౌకదుకాణములకు / గ్రామాలు లేక వార్డు సచివాలయములకు స్కూల్స్, హాస్టళ్లకు మరియు ప్రభుత్వము వారు సూచించిన ప్రదేశములకు స్టేజి II క్రింద రవాణా చేయుటకు ఆసక్తిగల వారి నుండి టెండర్లు కోరడం అయినది. ఆంధ్రప్రదేశ్ ఇ ప్రొక్యూర్‌మెంట్ సైట్ **https://tender.apeprocurement.gov.in/** నుండి పొందగలరు.

మండలస్థాయి గోదాములు, వాటికి అనుసంధానం చేయబడిన మండలములు, కేటాయించబడిన సరుకుల వివరములు మరియు యూనిట్ కాస్ట్ టెండరు షెడ్యూల్‌తో పాటు ఉండవలెను. దూరముతో సంబంధము లేకుండా క్వింటాల్ ఒక్కింటికి ఫ్లాట్ **(Flat)** రేటు వేయవలెను.

టెండర్ కాల పరిమితి	:	టెండరు ఖరారైన తేదీ నుండి 31.03.2027 వరకు
1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది	:	12.09.2025 ఉదయం 11.00 గం.ల నుండి
2. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది	:	21.09.2025 మధ్యాహ్నం 01.00 గం.ల వరకు
3. ఆన్‌లైన్ బిడ్‌ల స్వీకరణకు చివరి తేది & సమయం	:	21.09.2025 సాయంత్రం 05.30 గం.లకు
4. సాంకేతిక టెండర్లు ప్రారంభ తేది & సమయం	:	22.09.2025 ఉదయం 11.00 గం.లకు
5. ఆర్థిక (Financial) బిడ్లు ప్రారంభ తేది & సమయం	:	23.09.2025 సాయంత్రం 03.00 గం.లకు

టెండరు దరఖాస్తునకు జత పరచు నియమ నిబంధనలు మరియు అగ్రిమెంటును రూ. **5000/- + GST** ఇ-ప్రొక్యూర్‌మెంట్ సైట్‌లో ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా జమచేసి, టెండరు డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేయుకోవలెను.

టెండర్ ప్రక్రియలో ఏదైనా సందేహం తలెత్తితే దయచేసి కడపలోని **DM APSCSCL** కార్యాలయాన్ని సంప్రదించండి.

ఏ కారణమూ చేనైనను టెండర్లలో మార్పులు చేయుటకుగాని వాయిదా వేయుటకుగాని పూర్తిగా రద్దు పరచుటకు జిల్లా సంయుక్త కలెక్టర్ & ఇ.ఓ.ఇ.డి. వారికి పూర్తిగా అధికారము కలదు. ఈ అధికారాలను ఎవరు ప్రశ్నించ వీలు లేదు.

Sd/- ADITI SINGH, I.A.S.
జిల్లా సంయుక్త కలెక్టర్ & ఇ.ఓ.ఇ.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ
వై.యస్.ఆర్. కడప.

బహిరంగ ప్రకటన

ICICI Bank నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చకీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051


బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి పొందిన ("సౌకర్యం") తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను **సెప్టెంబర్ 22, 2025**న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం -**https://gold.samil.in** ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన ఋణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

ఋణ ఖాతా సం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆదోని	
068762013725	గౌస్ రాఘవేంద్ర
శాఖ పేరు: అమలాపురం	
044157000035	రుద్రరాజు రామలక్ష్మి
శాఖ పేరు: అనంతపురం	
043962018624	[illegible]
043962018598	బి బాబామొల్లా
శాఖ పేరు: అనంతపురం- విద్యుత్ నగర్	
575662000078	షేక్ మహమ్మద్ షాకీర్
శాఖ పేరు: బాపట్ల- ఆంధ్రప్రదేశ్	
358362006038	కోటేశ్వరరావు మాఘం
శాఖ పేరు: భీమవరం	
070457000229	[illegible]
శాఖ పేరు: బొబ్బిలి	
395662003335	[illegible]
శాఖ పేరు: బొల్లవరం- నందికొట్కూరు	
306862000657	షేక్ నెమూర్ రెహమాన్
శాఖ పేరు: చిట్టి ముల్లపూరం	
285562000153	జి లక్ష్మీకాంత రెడ్డి
శాఖ పేరు: కడప	
067462011214	పురం నారయ్య
067462011887	సిరిగిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి
శాఖ పేరు: గుడివాడ	
061157000070	నాగరాజు తోట
శాఖ పేరు: గుంతకల్	
067162015969	[illegible]
శాఖ పేరు: గుంటూరు	
630762030909	రామిశెట్టి రామ కృష్ణ
శాఖ పేరు: గుంటూరు- పొన్నూరు రోడ్	
532357000051	ఫిరోజ్ లాల్ షేక్
శాఖ పేరు: ఐ.ఎస్. జగన్నాధపురం	
286662000236	[illegible]
శాఖ పేరు: జగ్గయ్యపేట	
179757000007	ముత్తినేని వీరయ్య
శాఖ పేరు: జంగమేశ్వరపురం	
307362001050	బత్తుల శ్రీనివాసరావు
శాఖ పేరు: కడియం	
440905001551	గొర్రెల రుద్ర గణేష్
శాఖ పేరు: కదిరి	
395462002810	చిన్నమ్మ ఎం
శాఖ పేరు: కైకలూరు, ఆంధ్రప్రదేశ్	
377457000020	పొట్లూరు హేమంత్
శాఖ పేరు: కాకినాడ	
028057000409	అక్షర ప్రింటర్స్
028062009233	అక్షర ప్రింటర్స్
028062009553	అక్షర ప్రింటర్స్
028062009679	అక్షర ప్రింటర్స్
028062009771	అక్షర ప్రింటర్స్
శాఖ పేరు: కాకినాడ- సర్పవరం	
247757000067	యెర్నాయుడు చేపురుపల్లి
శాఖ పేరు: కల్వారి	
306962000570	వల్లూరు గాయత్రి నాగ సుబ్బలక్ష్మి
శాఖ పేరు: కంచికచర్ల	
068662013422	[illegible]
శాఖ పేరు: కావలి	
069362012485	సందీప్ కుమ్మరికుంట
శాఖ పేరు: కొవ్వూరు	
378762002605	కంటిపూడి వంశీకృష్ణ
శాఖ పేరు: కర్నూలు- తిలక్ నగర్	
465362000253	ఎం మహేష్
శాఖ పేరు: మదనపల్లె	
067362036657	[illegible]
శాఖ పేరు: మార్కాపురం	
395162004187	పసుపులేటి చంద్రశేఖర్
శాఖ పేరు: నాయుడుపేట	
069462012058	కృష్ణారెడ్డి మనోజ్ రెడ్డి
శాఖ పేరు: నంద్యాల	
068862014967	భాస్కర్ గౌడ్ కొప్పుల
శాఖ పేరు: నర్సీపట్నం	
400262004277	కేశవరపు శిరీష
శాఖ పేరు: నూజివీడు	
198257000065	గోపాలరావు తాళం
శాఖ పేరు: పలాస	
069962010782	తామాడ భాస్కరరావు
శాఖ పేరు: పార్వతీపురం	
070162017068	పైడప్పనాయుడు అల్లు
070162017227	పైడప్పనాయుడు అల్లు
070162015562	అల్లు చంద్రశేఖర రావు
శాఖ పేరు: పెద్దాపురం	
067862016588	అనపర్తి దుర్గా ప్రసాద్
067862016975	సింగన నాగబాబు
శాఖ పేరు: పీలేరు	
375562003129	కె విశ్వనాథ రెడ్డి
శాఖ పేరు: పిఠాపురం	
400862002511	నల్లజర్ల విజయ వినాయక్
400862003016	నల్లజర్ల విజయ వినాయక్
శాఖ పేరు: పుల్లంపేట	
204662000416	గుత్తి సుబ్రహ్మణ్యం
204662000394	గుత్తి సుబ్రహ్మణ్యం
204662000496	పంట ప్రవీణ్ కుమార్
శాఖ పేరు: పుంగనూరు	
377162003354	నరసింహ్మన్ రూప శ్రీ
శాఖ పేరు: పుట్టపర్తి	
130662006090	[illegible]
130662007854	[illegible]
శాఖ పేరు: రైల్వే కోడూరు	
430662002621	సిరిగిరాజు లలిత
శాఖ పేరు: రణస్థలం	
744062000870	[illegible] రాము
శాఖ పేరు: రేపల్లె	
400162004376	కొండమాదుగుల కోటి రెడ్డి
400162004380	కొండమాదుగుల కోటి రెడ్డి
400162004381	కొండమాదుగుల కోటి రెడ్డి
శాఖ పేరు: శ్రీకాళహస్తి	
375857000157	డి రమణయ్య
శాఖ పేరు: తిరుపతి- బై పాస్ రోడ్	
253762002829	మల్లు జనార్ధన రెడ్డి
శాఖ పేరు: తిరుపతి- కెటి రోడ్	
720957000138	వి మెడికల్స్
720957000139	వి మెడికల్స్
720957000145	వి మెడికల్స్
శాఖ పేరు: తుని	
197962013161	యెలకల నంద బాబు
197962013160	[illegible]
శాఖ పేరు: విజయవాడ- ఎనికేపాడు	
432062000692	వంశీకృష్ణ దొప్పలపూడి
శాఖ పేరు: విజయవాడ- వన్ టౌన్	
030357002086	అరుణ పేపర్ మార్ట్ & జనరల్
శాఖ పేరు: విజయవాడ- సత్యనారాయణపురం	
745362000620	చిలకలపల్లి యేసు
శాఖ పేరు: విశాఖపట్నం- అచ్యుతాపురం	
421057000104	అభినయ బిల్డర్స్ ఎండ్ సివిల్ వర్క్స్
శాఖ పేరు: విశాఖపట్నం- మురళి నగర్	
333557000038	అంధవరపు ప్రియాంక
శాఖ పేరు: విశాఖపట్నం- సీతమ్మధార	
249457000141	రాయుడు సుచిత
249457000178	రాయుడు సుచిత
249457000205	రాయుడు సుచిత
శాఖ పేరు: విశాఖపట్నం- సుజాతనగర్	
428262001308	పొడుగు ఝాన్సీ రాణి
428262001397	మజ్జి లక్ష్మి
శాఖ పేరు: విశాఖపట్నం- ద్వారకా నగర్	
006062016207	సబ్బవరపు దేముడు
శాఖ పేరు: విశాఖపట్నం- కూర్మనపాలెం	
437962000907	యలమశెట్టి శ్రీనివాసరావు
శాఖ పేరు: విజయనగరం	
070262006571	గుడివాడ రాంబాబు
శాఖ పేరు: [illegible]	
307262002821	[illegible]
307262002369	[illegible]
శాఖ పేరు: ఒంటిమిట్ట	
211262000830	మద్దెల రమేష్ బాబు
211262000803	తంగా శివ కుమార్
శాఖ పేరు: బాచుపల్లి	
279962002384	నిదుమోలు సాయి విశ్వనాథ్
శాఖ పేరు: చంద్రంపేట	
220162001358	సుదామల్ శ్రీకాంత్
శాఖ పేరు: హువినా హడగల్లి	
398662001698	దొబ్బరాయి రమణయ్య
శాఖ పేరు: హైదరాబాద్	
787557000197	బొమ్మ సంపత్
శాఖ పేరు: హైదరాబాద్- కూకట్‌పల్లి	
631262037336	ఎం.వి.వి. సుధాకర్
శాఖ పేరు: కోకినవానిపల్లి	
222262001158	రాచల కళ్యాణ్ రెడ్డి
శాఖ పేరు: షాద్‌నగర్	
379962005022	[illegible] రాధిక
శాఖ పేరు: సిద్దిపేట	
069162021895	కొలుపుల కనకవ్వ

తేది: 12.09.2025
ప్రదేశము: అనకాపల్లి, అనంతపురము, అన్నమయ్య, బాపట్ల, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, గుంటూరు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, పల్నాడు, పార్వతీపురం మన్యం, విజయనగరం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, చిత్తూరు, తిరుపతి, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, వై.యస్.ఆర్, ఆత్మకూర్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, నెల్లూరు, రామచంద్రపురం.

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున



బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 246596

బార్బర్ షాప్ నందు పనిచేయుటకు బార్బర్ కావలెను
కడప నగరం కో-ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా గుడి దగ్గరగల నారాయణ జెంట్స్ బ్యూటీపార్లర్ (బార్బర్ షాపు) నందు పనిచేయుటకు బార్బర్ కావలెను సం: 94906 53625
Ajc-000

CHANGE OF NAME
★ I, SHAIK ZAHARUNNISA (old name) W/o. SHAIK GHOUSEMOHIDDIN, R/o 4/106-2, Kagitala Peta, Kadapa, YSR District,A.P. I changed my name to SHAIK ZAHEERUNNISA Henceforth, I will be known as SHAIK ZAHEERUNNISA AJH-003385

CHANGE OF NAME
★ I, SYEDA KHADIRUNNISA (old name) W/o. SYED MAQBOOL BASHA, R/o 47/106-2, Kagithalapenta, Kadapa, YSR District, A.P. I changed my name to MULLA KHADEERUNNISA Henceforth, I will be known as MULLA KHADEERUNNISA AJH-003384

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

మంత్రి చొరవతో ఆగిన రైళ్లు

● బీజేపీ నేతల సంబరాలు



రైల్వేస్టేషన్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కరోనా సమయం నుంచి కోడూరు రైల్వేస్టేషన్ పరిధిలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడం లేదు. అయితే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చొరవతో స్టాపింగ్ లభించడంతో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. గురువారం కోడూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే ఉద్యోగులకు, ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు బీజేపీ మండల అధ్యక్షుడు సాయం శ్రీధర్ మాట్లాడుతూ రైళ్ల నిలుపుదల కోసం అనేక సార్లు కృషి చేసామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.యన్ మాధవ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు సహకారంతో రైళ్ల నిలుపుదల జరిగిందని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుబ్బారావు, రాము, సుమంత్, విశ్వనాథ్, హరీష్, సుబ్బారావు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెంపో- స్కూటర్ ఢీ



రోడ్డు పక్కన బోల్తా పడిన టెంపో

గాలివీడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నూలివీడు మార్గంలో టెంపో స్కూటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికల కథనం మేరకు.. నూలివీడు నుంచి గాలివీడు వైపు వస్తున్న టెంపో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లుగా సమాచారం. అయితే రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి: సీపీఐ

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం 2, 3 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్టు పైపులైన్ ద్వారా లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలో తాగునీటితో ఇబ్బంది పడుతున్న అన్ని వార్డులకు మళ్లిస్తే శాశ్వత పరిష్కారం చూపినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ లక్కిరెడ్డిపల్లె మండల కార్యదర్శి ఓబులేసు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు పాల్గొన్నారు.

బాధ్యతగా మెలగాలి : చైర్మన్

నందలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండంలోని ఆడపూరు గ్రామంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని ఉపాధ్యాయుడు, సిబ్బంది బాధ్యతగా మెలగాలని ఆ పాఠశాల చైర్మన్ ఇరువూరి మురళీ పేర్కొన్నారు. గురువారం ఆయన పాఠశాలలోని ప్రాంతాలను, పిల్లలకు తయారు చేస్తున్న ఆహార పదార్థాలను అక్కడున్న కూరగాయలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పేద విద్యార్థులకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఇస్తున్న నాణ్యమైన విద్య, వసతుల కల్పనను స్కూలు అధికారులు, సిబ్బంది ఎక్కడా భంగం కలిగించవద్దన్నారు.

రైతులకు బాసటగా నిలవాలి

● మంత్రులు సత్యకుమార్‌యాదవ్, రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు పాలకమండలి సభ్యులు బాసటగా నిలవాలని మంత్రులు సత్యకుమార్ యాదవ్, రాంప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. గురువారం రాయచోటి మాసాపేట మార్కెట్ యార్డులో నూతనంగా రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారం మహోత్సవంలో పాల్గొన్నారు. తొలుత రాయచోటి మార్కెట్ యార్డు చైర్మన్‌గా అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్‌గా షఫీనాయక్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అబద్ధాలు తప్ప హామీలను నెరవేర్చలేదని అందుకే ప్రజలు 11 స్థానాలతో బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బీజేపీ శ్రీనివాసరాజు, మదన్‌మోహన్‌రెడ్డి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'

రాజంపేటటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పనికి తగిన వేతనం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.శ్రీలక్ష్మీలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం రెండో మహాసభలను నిర్వహించారు. ఈ మహాసభలను ఎన్జీవో హోంలో ఎంవిజయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజయమ్మ2 ఎం.ఈశ్వరమ్మ, అమరావతి, శివరంజని, శివ జ్యోత్స్న, సుష్మిత, ఇందిరమ్మ, అనురాధ, విజయలక్ష్మీ, ఉమాదేవి, నాగరత్న పాల్గొన్నారు.

పీఆర్సీ వెంటనే అమలయ్యేలా చూడండి



రాయచోటిలో మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం, సిద్దవటంలో నిరసన తెలుపుతున్న అపస్ నేతలు

● మంత్రి సత్యకుమార్‌ను కోరిన అపస్ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను గురువారం ఎమ్మెల్సీ జకియాఖానం గృహంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లాశాఖ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని వినతిపత్రం సమర్పించారు. అలాగే నూతన పీఆర్‌సీని తక్షణం అమలయ్యే విధంగా చూడాల కోరారు. కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా గౌరవాధ్యక్షుడు పరశురాం, రాష్ట్ర కార్యదర్శి మధుమతి, జిల్లా కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పాతపెన్షన్ అమలు చేయాలని వినతి

డీఎస్సీ-2003 ఫోరం ఆదేశాల మేరకు మెమో నెంబర్ 57 అనుసరించి పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కన్వీనర్ ఆంజనేయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి తాలూకా ఎన్జీవో ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె తాలూకా ఎన్జీవో ప్రెసిడెంట్ బలరామరాజు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడునాయక్, జిల్లా అధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ గోపీకి వినతిపత్రం అందజేశారు.

రాజంపేట: ఉపాధ్యాయుల ఫోరం పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా గురువారం కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దారు పీరుమున్నీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, కన్వీనర్ ఉదయభాస్కర్, మాధవమూర్తి, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

సిద్దవటం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల ఫోరం పిలుపుమేరకు నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కన్వీనర్ వీరప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యున్నత హోదాలో ఉన్న వారికి ఒక న్యాయం, దిగువ స్థాయిలో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల ఫోరం సభ్యులు సోమశేఖర్, చంద్రమోహన్ రెడ్డి, రామకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలను పరిష్కరించండి

● మేదర సంఘం నేతల వినతి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ గురువార మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు రాయచోటిలో మహేంద్ర (మేదరి) సంఘం ఆధ్వర్యంలో మేదరి కుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగా ఏపీలో మేదరి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ మహేంద్ర (మేదరి) సంఘం గౌరవాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు నాగార్జున, ఉపాధ్యక్షుడు నరసింహులు(బాబు), ప్రధాన కార్యదర్శి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అవకాశాలను అందిపుచ్చుకోవాలని వెలుగు ఏపీఎం పి.వసుంధర తెలిపారు. గురువారం స్త్రీ శక్తి భవన్‌లో జిల్లా పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార పరిశ్రమ రంగాల్లో అవసరమైన ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా చేశారని తెలిపారు. మంచి వ్యాపార ప్రణాళికలతో అవగాహనతో ముద్ర, పీఎం.ఈ.జీ.పీ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు పొంది సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలు ఎదగాలని తెలిపారు. జిల్లా పరిశ్రమలశాఖ ప్రమోషన్ అధికారి కె.నాగార్జున మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, యానిమేటర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ పంపిణీ



బాధితులకు చెక్కులను పంపిణీ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి నిర్ణీత సమయంలో వారి అవసరాలకు అనుగుణంగా వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు చేయూతనందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుంటూరు భాగ్యమ్మకు రూ.66,804, పేరూరు కృష్ణయ్యకు రూ.1,53,930, షేక్ సర్దార్‌బాషాకు 77,063, సిగొల్ల వెంకటసుబ్బయ్యకు రూ.22,114, చమర్తి సునీత రూ.41,112, గుడారు వెంకట మనోహర్‌కు 40,125, వెంకటసుబ్బమ్మకు రూ.40 వేలు, కొంగని శ్రీనివాసులుకు రూ.40 వేలు, తదితరులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో హైస్కూల్ భేష్

పెనగలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో చక్రంపేట హైస్కూల్ అన్నిరంగాల్లో ఆదర్శంగా ఉందని రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి నాగయ్య అన్నారు. గురువారం చక్రంపేట ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల విద్యాభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుదర్శన్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న కోలాట ప్రదర్శనను తిలకించి ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు సీఆర్పీ బాదుషా పాల్గొన్నారు.

రాష్ట్రంలో యూరియా కొరత లేదు

● ప్రజాదర్బార్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి

చిన్నమండెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత ఎక్కడా లేదని, అవసరం ఉన్న ప్రతి రైతు యూరియా తెచ్చుకోవాలని గురువారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్



పొలాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకటమోహన్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గొర్లముదివేడు, యండపల్లి గ్రామాల్లో మహిళా రైతు లక్ష్మమ్మ పొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగలో అనుసంధాన పంట సాగుచేయడం ద్వారా భూ సారం మెరుగుపడుతుందని, జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుని గ్రామోత్సవం

పెనగలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇండ్లూరు గ్రామంలో వెలసి ఉన్న సిద్దివినాయకస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత సిద్ది వినాయకుని గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఊరేగింపు చేశారు. అలాగే బొడ్డు రామకృష్ణయ్య అనే పండరి భజన గురువు ఆధ్వర్యంలో మహిళలు కోలాట ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాకాటి నరసింహారెడ్డి, వేటూరు మధుసూదన్‌రెడ్డి, దేపూరు రాజశేఖర్‌రెడ్డి, పాలిపి వెంగల్‌రెడ్డి, బచ్చల రమణారెడ్డి, మురగాచారి తదితరులు ఉన్నారు.

ఏవోగా రామసుబ్బారెడ్డి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఏవోగా రామసుబ్బారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిట్వేలిలో పనిచేస్తూ పదోన్నతిపై ఏవోగా ఒంటిమిట్టకు విచ్చేశారు.కాగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కన్యాకుమారి రైలు నిలుపుదలపై హర్షం



లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్‌లను సత్కరిస్తున్న దృశ్యం

నందలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పూణె నుంచి కన్యాకుమారి వెళ్లే జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ రైళ్ల నందలూరు రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేయడంపై అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచారసభ జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యులు ఏనుగుల బాలాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం నందలూరు రైల్వేస్టేషన్‌కు అయ్యప్ప భక్తులతో చేరుకుని రైలు లోకో పైలట్, సహాయ లోకో పైలట్‌లను శాలువాలతో సన్మానించి మిఠాయిలు అందజేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్-19 నుంచి నందలూరు రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు నిలుపుదలను తీసివేశారు. ప్రస్తుతం రైళ్లను మళ్లీ నిలుపుదల చేయడంతో ఆనందం పంచుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు శివశంకర్, మురళీధర్, సుధాకర్, మోహన్ పాల్గొన్నారు.

పెనగలూరులో భారీ వర్షం

పెనగలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు ఆవర్తనం అల్పపీడనం కారణంగా గురువారం తెల్లవారుజామున 4.30 నుంచి 6.30 గంటల వరకు అతి భారీ వర్షం కురిసింది. రెవెన్యూ రికార్డు ప్రకారం 48.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత రెండు రోజులు తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. దాదాపు నాలుగు పదున్ల వర్షం కురిసి ఉంటుందని అంచనా.

ఎంపీడీవోగా పరిపూర్ణ అరుంధతి



బాధ్యతలు చేపడుతున్న పరిపూర్ణ అరుంధతి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల అభివృద్ధి అధికారిగా పరిపూర్ణ అరుంధతి గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో వైఎస్ఆర్ కడప జిల్లా ముద్దనూరులో ఏవోగా పనిచేస్తూ పదోన్నతిపై రాయచోటి మండల అభివృద్ధి అధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయచోటి మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది నూతన ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవోకు డీడీవోగా పదోన్నతి



రామచంద్ర (ఫైల్‌ఫొటో)

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఎంపీడీవోగా పనిచేస్తున్న రామచంద్రను చిత్తూరు జిల్లా కుప్పం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో)గా పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ వీఆర్ కృష్ణతేజ నుంచి ఉత్తర్వులు అందాయి. ఉత్తర్వుల మేరకు గురువారం సంబేపల్లె ఎంపీడీవోగా రిలీవ్ అయ్యారు. పదోన్నతిపై వెళుతున్న ఎంపీడీవో రామచంద్రను సంబేపల్లె ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దూరంగా ఉంటాయని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని దేవళంపల్లి పీహెచ్‌సీ, లక్కిరెడ్డిపల్లె కమ్యూనిటీ హాస్పిటల్‌ను ఆయన పరిశీలించారు. రోగులు ఎక్కువ ఉన్నారని, వారికి రక్త పరీక్షలు నిర్వహించాలని డాక్టర్లకు తెలియజేశారు. సర్పంచ్ అహల్య, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డిల అధ్యక్షతన లక్కిరెడ్డిపల్లె మురుగు కుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో దేవదానం, ఆరోగ్య కార్యకర్తలు రాజేంద్రప్రసాద్, బేబీ, ఆశావర్కర్లు, డాక్టర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి గురువారం సీఎం ఆర్ఎఫ్ చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందించారు. అనారోగ్య బాధితులకు సీఎం చంద్రబాబునాయుడు సీఎం సహాయ నిధి నుంచి ఆదుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాయచోటి నియోజకవర్గం నుంచి 50 మంది లబ్ధిదారులకు రూ.27.18 లక్షల చెక్కులను, ఇద్దరు బాధితులకు రూ.8 లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యాన యూనివర్సిటీలో రైతులకు శిక్షణ

రైల్వేకోడూరురూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో ఉన్న ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం ఆత్మ ఆధ్వర్యంలో హార్టికల్చర్ రీసర్చ్ స్టేషన్‌లో రైతులకు మష్రూమ్ యూనిట్ నర్సరీలు, పాలీహౌస్ మొక్కల పెంపకం పద్ధతులను వివరించారు. సేంద్రీయ పద్ధతులైన ఎరువుల వాడకం జీవన ఎరువుల ఉపయోగం, బొప్పాయి పంటపై శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్‌నాయక్, డాక్టర్ యోహన్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ ఈరేష్‌కుమార్‌లు, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్లు, బాలసుబ్రహ్మణ్యం, కుమార్, మండల వ్యవసాయ అధికారి సందీప్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుధీర్ వర్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి సీనియర్ నాయకురాలు



బుజ్జమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముక్కా

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బండారు సుభద్రమ్మ(బుజ్జమ్మ) ముక్కావారిపల్లిలో టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సమక్షంలో తన సొంతగూటికి టీడీపీలో చేరారు. తన రాజకీయ జీవితం టీడీపీతో మొదలుపెట్టి 2019 ఎన్నికల్లో వైసీపీకి తన మద్దతు ఇచ్చి కోడూరులో పార్టీ విజయం కోసం కృషి చేశారు. కొన్ని వ్యక్తిగత కారణాలతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ పార్టీకి తన పూర్తి మద్దతు ప్రకటించి పార్టీ విజయానికి సహకరించారు. గురువారం తన అనుచరులతో కలిసి ఇన్‌చార్జ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆమె మాట్లాడుతూ సొంతగూటికి రావడం సంతోషంగా ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతులకు అవగాహన కార్యక్రమం

రామాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులకు నానో జీవన ఎరువుల వినియోగంపై వ్యవసాయశాఖ అధికారి నాగమణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో ప్రభావతమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సహకరించాలి: తహసీల్దార్

సుండుపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి కుటుంబ సభ్యులు సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల నమోదు కొరకు వివరాలు తెలియజేయాలని తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ సుమోటలో కుల ధ్రువీకరణ కొరకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వివరాలు తెలియజేసిన వారికి ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అలాగే ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వీఆర్‌వోలకు, వీఆర్ఏలకు ప్రజలు సహకరించి వివరాలను తెలియజేయాలని తెలిపారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

సుండుపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భాగంపల్లి, జి.రెడ్డివారిపల్లె పంచాయతీల్లోని గ్రామాల్లో గురువారం యూరియాపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సహజ సిద్ధంగా దొరికే వేపాకు, కానుగాకు, జిల్లేడు కొమ్మలు వీటన్నింటినీ భూమిలో కలియదున్నేస్తే భూమి సారవంతం పెరుగుతుందన్నారు. తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఏవో మహబూబ్‌బాషా, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



అతిగా వాడితే అనర్థమే..!

- సమతుల్య ఎరువుల వాడకం కీలకం
- అతిగా యూరియా వాడకంతో దెబ్బతింటున్న భూసారం
- ఎరువుల అతి వినియోగంతో ఆర్థిక భారం
- సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి


వరిలో కలుపు తీస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన అధిక దిగుబడులకు సమతుల్య ఎరువుల వాడకం కీలకం. ఎంత ఎరువు వాడితే పంటకు అంత బలం అనే అపోహ చాలామంది రైతుల్లో ఉంది. మోతాదుకు మించి ఎరువులు, పురుగుల మందుల వాడకం పంటలకు బలం కాదు.. భూసారాన్ని తగ్గించేసి దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట వరి. అవసరం మేరకు విడతల వారీగా ఎరువులు తీసుకోవడం కాకుండా ఒకేసారి సమీకరించుకోవాలనే తాపత్రయం, వ్యాపారుల లాభాపేక్ష వెరసి యూరియా కొరతకు కారణమవుతోంది. మన పూర్వీకులు పొలం గట్లపై ఉండే కానుగ, వేప, జిల్లేడు, వెంపలి, అవిశ చెట్ల పచ్చి ఆకు కొట్టి తెచ్చి కలియ దున్నడం, పశువుల ఎరువు వంటి సహజ వనరులపై ఆధారపడేవారు. దురదృష్టవశాత్తు తగినంత పశువుల ఎరువు అందుబాటులో లేనందున రైతులు కృత్రిమ ఎరువులు ప్రధానంగా యూరియాపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలలో సమతుల్య ఎరువుల వినియోగం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రధానంగా నత్రజని అందించే యూరియా సమతుల్యంగా వినియోగించడం చాలా ముఖ్యం.

అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల భూసారం క్రమంగా తగ్గిపోతుంది. భూగర్భ జలాలు, నీటి వాగులు కలుషితం అవుతాయి. పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుంది. సాగు ఖర్చులు పెరిగి లాభం తగ్గుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

యూరియా తగ్గించే ప్రత్యామ్నాయాలు

పశువుల ఎరువు, వర్మీ కంపోస్టుతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పొలం గట్టపై ఉండే కానుగ, వేప, అవిశ చెట్ల పచ్చి ఆకులు వేసి కలియ దున్నడం, సీజను వర్షానికి ముందు పొడి విత్తనాలు చల్లడం, పచ్చిరొట్ట విత్తనాలు చల్లడం, పంట అవశేషాలను కలియ దున్నడం ద్వారా తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా నత్రజనిని పంటకు అందించవచ్చు. అలాగే జీవన ఎరువులైన అజటో బ్యాక్టర్, అజోస్పరిల్లం, రైజోబియం వినియోగించడం వలన పంటలకు తక్కువ ఖర్చుతో నత్రజని లభ్యత, భూసారం పెంచవచ్చు. ఈ విధానం ద్వారా 20 నుంచి 25 శాతం నత్రజని ఆదా చేయవచ్చు.

కొత్త తరహా ఎరువుల వాడకం....

నానో యూరియాను పైపాటుగా పంట కాలంలో రెండు మూడు దఫాలుగా పిచికారీ చేయడం వలన 80 శాతం నత్రజని లభ్యత పెంచడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూ దిగుబడిలో ఎటు వంటి తగ్గుదల ఉండదు.

పీలేరులో ఖరీఫ్ సాగు...

నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వరి, వేరుశనగ పంటల సాగు విస్తీర్ణం హెక్టార్లలో ఇలా ఉన్నాయి. పీలేరు మండలంలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 355 హెక్టార్లకు గాను 180 హెక్టార్లలో సాగు చేశారు. వేరుశనగ 1826.8 హెక్టార్లకు గాను 210 హెక్టార్లలో సాగు చేశారు. కేవీ పల్లె మండలంలో వరి 370 హెక్టార్లకు 120 హెక్టార్లు, వేరుశనగ 2619 హెక్టార్లకు కేవలం 172 హెక్టార్లలో సాగు చేశారు. వాల్మీకిపురం మండలంలో వరి 578 హెక్టార్లకు గాను 2.33, వేరుశనగ 1392 హెక్టార్లకు 86.62 హెక్టార్లలో సాగు చేశారు.

గుర్రంకొండ మండలంలో వరి 343 హెక్టార్లకు 39.07, వేరుశనగ 916 హెక్టార్లకు గాను 35.83 హెక్టార్లలో సాగు చేశారు. కలికిరి మండలంలో వరి 416 హెక్టార్లకు గాను 75.72, వేరుశనగ 1100 హెక్టార్లకు 52.33 హెక్టార్లలో సాగు చేశారు. కలకడ మండలంలో వరి 229 హెక్టార్లకు 22.77, వేరుశనగ 986 హెక్టార్లకు 44.14 హెక్టార్లలో సాగు చేశారు. ఇవి కాక అరకొరగా కూరగాయలు, టమోటా, బొప్పాయి, పశుగ్రాసం రైతులు సాగు చేశారు.

వరి ఎకరాకు వేయాల్సిన ఎరువులు...

ఒక ఎకరా వరి పంట సాగు చేస్తే రైతులు 75 కిలోల యూరియాను మూడు దఫాలు సమాన మోతాదులో పిచికారీ చేయాలి. డీఏపీ, గ్రోమోర్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 40 కిలోలు ఒకసారి మాత్రమే వేయాలి. పొటాష్ 30 కిలోలు దమ్ములో 15 కేజీలు, చిరు పొట్ట దశలో 15 కిలోలకు వాడాలి. అయితే వాటికి రెండు, మూడింతలు ఎరువులు వినియోగిస్తున్నట్లు అధికారులు, శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అధిక మొత్తంలో ఎరువుల వాడకం పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

వరి పంటకు మేలు కంటే కీడే ఎక్కువ....



రసాయన ఎరువుల వినియోగం వరి పంటకు మేలు కంటే కీడు ఎక్కువ చేస్తుంది. ఎరువుల అతి వినియోగంతో ఆర్థిక భారమే కాకుండా తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గే అవకాశముంది. భూసారం దెబ్బతింటుంది. కొందరు రైతులు సహజసిద్ధ పద్ధతుల్లో కషాయాల వినియోగంతో పెట్టుబడులు తగ్గించుకోవడమే కాకుండా భూసారాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. యూరియా అధిక మోతాదులో వాడకం వల్ల అనేక నష్టాలను చవిచూసే ప్రమాదం ఉంది. నత్రజని అందించే యూరియా ఎరువు సమతుల్యంగా వినియోగించడం చాలా ముఖ్యం.

- వైవీ రమణరావు, ఏడీఏ, పీలేరు.

ఎకరాకు రూ.35 వేలకు పైగా ఖర్చు



ఒక ఎకరా వరి పంట సాగుకు రూ.35 వేలకు పైగా ఖర్చు వస్తోంది. సకాలంలో ఎరువులు, కలుపు తీత తదితర పనులు పూర్తి చేస్తే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల దిగుబడి ఉంటుంది. అయితే అనేక కష్టనష్టాలకు ఓర్చి పంట చేతికందే సమయానికి గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యూరియా కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. రైతుల ఇక్కట్లు గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- చిన్నయల్లప్ప, రైతు, కురవపల్లె, పీలేరు మండలం.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


నాగేంద్ర (ఫైల్)

రామాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కూలి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా... మండలంలోని రాచపల్లి పంచాయతీ వడ్డెపల్లెకు చెందిన కుంచపు నాగేంద్ర (33) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో అప్పులు ఎక్కువై దిక్కుతోచని స్థితిలో బుధవారం పొద్దుపోయాక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తల్లి కుంచపు వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని శవపరీక్షకై రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, శవపరీక్ష అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య హితం


ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న రైతులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యకరమని పోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ అన్నారు. గురువారం గుండ్లపల్లె రైతులతో కలిసి పోర్డు సంస్థ ప్రతినిధులు అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సహకారంతో కడప జిల్లా పొద్దుటూరు సమీపంలోని కల్లూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి సేద్యంతో పంటల సాగు, పెట్టుబడి, పండించిన పంటలు, జీవన ఎరువులు, జీవామృతంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి తదితర అంశాలపై సీఎస్‌ఆర్ సంస్థ ప్రతినిధులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ డైరెక్టర్ ఆదినారాయణ, అభిషేక్, పవన్‌కుమార్, పోర్డు ప్రతినిధులు రమణ, సంపూర్ణ, హేమంత్, అనిత, నరసింహులు, రైతులు వేట మల్లికార్జున, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్‌లో చోరీ

- 13 తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీ

పెనగలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వినాయకనగర్‌లోని డేరంగుల జయమ్మ ఇంట్లో చోరీ జరిగి 13 తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ బి.రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ చోరీ పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ ఆధ్వర్యంలో రాయచోటి నుంచి వేలిముద్రల సేకరణ బృందం సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. బాధితురాలు జయమ్మ గత ఆదివారం కడపలోని తన సోదరి దగ్గరకు వెళ్లారు. బుధవారం సాయంత్రం తిరిగి పెనగలూరు వినాయకనగర్‌లోని ఇంటికి చేరుకోగానే ప్రధాన తలుపులు బార్ల తెరిచి ఉండడంతో హుటాహుటిన ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూం తలుపులు పగులగొట్టి ఉండడంతో కంగారుపడ్డారు. బీరువా వైపు చూడగా బీరువా తలుపులు కూడా పగులగొట్టి అందులోని బంగారు, నగదుతో పాటు వెండి గొలుసులు, పూజగదిలోని జత వెండి దీపాలు కూడా అపహరించుకు పోయినట్లు తెలిపారు. దోపిడీ జరిగినట్లు గుర్తించిన జయమ్మ హుటాహుటిన బంధువుల సహకారంతో పెనగలూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షలు నగదు చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ప్రజలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ ప్రజలకు సూచించారు. విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో దాచుకుంటే భద్రంగా ఉంటుందన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనుల పరిశీలన


ఆలయం వద్ద అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్, తదితరులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నగల్లు గ్రామంలో పురాతన చెన్నకేశవస్వామి జీర్ణోద్ధరణ పనులను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ఇటీవల దేవదాయ రూ.40 లక్షలతో కొత్తగా ఆలయాన్ని నిర్మిస్తుండడంతో ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. కాగా గ్రామస్తులు ఆలయానికి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని దేవదాయ శాఖ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయించి ఆలయాన్ని ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు చంద్రమోహన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రమణ, కేశవ, వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వన్‌బీ అడంగల్‌ను పునరుద్ధరించాలి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దేవదాయ భూములకు సంబంధించి దేవుడి మాన్యం భూములకు వన్‌బీ అడంగల్‌ను పునరుద్ధరించాలని పెద్దతిప్పసముద్రం తహసీల్దార్‌ను అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ కోరారు. ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆలయ భూములకు సంబంధించి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆలయ భూములు 26.87 సెంట్ల భూమికి వన్‌బీ అడంగల్ ఇతరుల పేర్లతో నమోదయ్యాయని, వ్యక్తుల పేర్లను తొలగించి దేవుని గుడి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరడంతో దీనిపై వెంటనే తగు చర్యలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తహసీల్దార్ ఆయనకు తెలిపారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా ఎయిడ్స్ లెప్రసీ అధికారి రమేష్ అన్నారు. గురువారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందితో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ కేసులు నమోదు చేసి రిజిస్ట్రేషన్ తప్పక చేయాలన్నారు. కళాశాలల్లో, హైరిస్క్ ప్రాంతాల్లో క్యాంపెయిన్ చేయాలన్నారు. ఐసీటీసీ, ఏఆర్టీ కేంద్రాల్లో సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డేవిడ్ భాస్కర్, కౌన్సిలర్లు జయకుమార్, చంద్రమోహన్, పుల్లయ్య నాయుడు, దీప్తి, పాల్గొన్నారు.

భళా.. కళా ఉత్సవ్

డైట్ కేంద్రంలో ఘనంగా ప్రారంభమైన కళా ఉత్సవ్ పోటీలు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం



కళా ఉత్సవ్ పోటీల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని కళాత్మక ప్రతిభను వెలికి తీసేందుకు ఉద్దేశించిన కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు గురువారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలను పెంపొందించడం, కళల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించేందుకు విద్యార్థులకు వేదికను అందించడం, ప్రాంతీయ స్థాయిలో కళలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, కథాకథనం పోటీల్లో 47 పాఠశాలల నుంచి 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతి విభాగంలో పోటాపోటీగా తమ ప్రతిభను ప్రదర్శించారు. కళా ఉత్సవ్‌లో విద్యార్థులకు కళా నైపుణ్యాలకు సంబంధించి ఆరు విభాగాల్లో 12 అంశాల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారిని జిల్లా స్థాయి కళాఉత్సవ్ విజేతలుగా ప్రకటిస్తామని కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమ న్యాయ నిర్ణేతగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత ప్రముఖ రచయిత డాక్టర్ వేంపల్లి గంగాధర్ వ్యవహరించారు. ఈఅ సందర్భంగా బాలికలు చేసిన నృత్యం ఆహుతులను అలరించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, కళాకారులు స్వతంత్ర బాబు, డైట్ అధ్యాపకులు, ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు చల్లా కళ్యాణి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం రెడ్డికోటకు సమీపంలోని పర్లగోళ్లపల్లె వద్ద ఏపీఐఐసీకి కేటాయించిన ప్రభుత్వ భూములను గురువారం సబ్‌కలెక్టరు చల్లా కళ్యాణి అధికారులతో కలసి పరిశీలించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి గతంలో రెడ్డికోట వద్ద 20 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే రోడ్డున పడతామని స్థానిక రైతులు సబ్‌కలెక్టరు ఎదుట వాపోయారు. స్పందించిన సబ్‌కలెక్టరు బాధిత రైతుల వద్ద ఉన్న భూమి పాసుపుస్తకాలను పరిశీలించారు. భూమికి సంబంధించి రైతుల వద్ద ఉన్న ఆధారాలు (భూమి పాసుపుస్తకాలు, ఇతర రికార్డులు), తమ వద్ద (రెవెన్యూ కార్యాలయంలో) ఉన్న రెవెన్యూ రికార్డులు తీసుకుని మదనపల్లెలోని కార్యాలయానికి రావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు ధనుంజయులు, మండల సర్వేయరు నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు


స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గాలివీడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి యూరియాను వాడరాదని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామంలో డీపీఎం వెంకటమోహన్‌తో కలిసి యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్నదాతల్లో మార్పు రావాలని, భూమి సారవంతాన్ని పెంచి అధిక దిగుబడులు ఇచ్చేలా ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. అనంతరం యూరియా స్టాక్ పాయింట్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో నవంత్, మండల వ్యవసాయ అధికారిణి గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

లోను ఇప్పిస్తామని నమ్మించి మహిళపై దాడి

బంగారు నగల అపహరణ


గాయపడిన రమాదేవి

పుల్లంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళకు లోను ఇప్పిస్తామని నమ్మించి ఆపై దాడి చేసి బంగారు నగలతో ఉడాయించిన ఘటన మండలంలోని వత్తలూరు పంచాయతీలో జరిగింది. పుల్లంపేట ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. మండల పరిధిలోని వత్తలూరు వడ్డిపల్లెకు చెందిన ఏరుకాలువ రమాదేవి (56) రాజంపేటలో నివాసం ఉంటోంది. ఈమె భర్త, కుమారుడు కువైత్‌లో ఉన్నారు. ఒక కుమార్తె రాజంపేటలో ఉండగా మరో కుమార్తె రైల్వేకోడూరులో ఉంటోంది. వడ్డిపల్లె అరుంధతివాడలో ఓ మహిళకు రమాదేవి కొంత నగదు అప్పుగా ఇచ్చింది. ఆమె పెనగలూరు మండలంలో ఉండడంతో వారం క్రితం ఆమె దగ్గరకు వెళుతుండగా ఒక యువకుడు పరిచయమయ్యాడు. ఆమె ఫోన్ నెంబరు తీసుకుని తన ఇంటికి, తన కుమార్తె ఇంటికి వస్తూ ఫోన్ చేస్తూ మీకున్న పొలానికి లోను ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో రమాదేవి బుధవారం సాయంత్రం ఆ యువకుడిని తన పొలం వద్దకు తీసుకెళ్లింది. అనంతరం పొలం దగ్గర ఉన్న తిప్పపైకి రమాదేవిని తీసుకెళ్లి కిందకు తోసేశాడు. అంతటితో ఆగకుండా ఆమె తలపైన, ఒళ్లంతా రాళ్లతో కొట్టడంతో ఆమె చంపేస్తాడేమోనని స్పృహ తప్పినట్లు పడిపోయింది. దీంతో ఆ యువకుడు ఆమె మెడలోని తాళిబొట్టు సరుడు, కమ్మలు లాక్కెళ్లినట్లు ఎస్‌ఐ వివరించారు. బంధువుల సహాయంతో ఆమె తిరుపతిలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో చికిత్స పొందుతోంది. ఆమె ఇచ్చిన ఫోన్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలు


బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్

రాజంపేటటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదల కోసం సబ్సిడీ బియ్యాన్ని అందజేస్తుందని, దాన్ని అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు రవికుమార్ తెలిపారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమంగా ప్రభుత్వ బియ్యం తరలించకుండా పలు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపట్టారు. డీలర్ల వద్ద ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. రాజంపేట, నందలూరు, పుల్లంపేట, పెనగలూరు ప్రాంతాల్లోని డీలర్లకు అధునాతనమైన 139 ఈ పాస్ యంత్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. వీటివల్ల లబ్ధిదారులకు తలెత్తుతున్న ఇబ్బందులు తొలగిపోతాయన్నారు.

వై.కోటలో చిన్నారి మృతి


చందన (ఫైల్)

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వై.కోట గ్రామానికి చెందిన అంకిపల్లి విజయ్, రాజేశ్వరి దంపతుల కుమార్తె చిన్నారి చందన (8) గురువారం మృతి చెందింది. గ్రామ పరిధిలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఈ చిన్నారి మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు గల్ఫ్‌కు వెళ్లడంతో పెద్దనాన్న వద్ద ఉంటోంది. రోజూలాగే ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లింది. అనంతరం ఏమైందో గానీ 10 గంటలకు వాంతులు చేసుకోగా గమనించిన ప్రధానోపాధ్యాయుడు మహదేవ సిబ్బందితో కలిసి చిన్నారి ఇంటికి తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అనంతరం పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చిన పాప పెద్దనాన్న రైల్వేకోడూరులోని ఓ ఆసుపత్రికి తరలించే క్రమంలో వైకోట బస్టాప్ వద్ద ఆ చిన్నారికి ఫిట్స్ వచ్చాయని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే కోడూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించి మెరుగైన వైద్య చికిత్స కొరకు తిరుపతికి తరలిస్తుండగా చిన్నారి మృతి చెందినట్లు వారు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భోరున విలపించారు. శుక్రవారం ఉదయం గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వస్తున్నట్లు తెలిసింది.

పేరుకే...50 పడకల ఆసుపత్రి

- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యం అందక రోగుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో దుస్థితి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పేరుకే అది 50 పడకల ఆసుపత్రి. ఇక్కడకు ప్రతి నిత్యం వందల మంది రోగులు వస్తుంటారు. అయితే డాక్టర్ల కొరత కారణంగా పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి రోగులకు వైద్యసేవలు అందించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...

పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాలకు ప్రధాన కేంద్రం. ఈ మండలాల గ్రామీణ ప్రజలు వైద్యసేవలు పొందాలన్నా, చిన్న ప్రమాదం జరిగినా ముందుగా ఈ ఆసుపత్రిని ఆశ్రయిస్తారు. దీంతో ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా 30 పడకలతో ఉన్న ఆసుపత్రిని 2019లో 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.3కోట్లు నిధులు వెచ్చించి భవనాలు నిర్మించి 50 పడకల ఆసుపత్రిగా మార్చి ఆధునిక పరికరాలన్నీ ఏర్పాటు చేసి 2023లో ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి అసుపత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్ల నియామకం చేపట్టపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీనిపై పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డాక్టర్ల కొరతతో ఇక్కట్లు

పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నిత్యం 200 నుంచి 300 మంది వివిధ రకాల వ్యాధిగ్రస్తులు ఈ ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. అయితే ఇక్కడ డాక్టర్ల కొరత తీవ్ర సమస్యగా మారింది. 12మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా మొన్నటి వరకు ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇటీవల మరో ఇద్దరు జాయిన్ కావడంతో ఆ సంఖ్య ఐదుగురికి చేరింది. ఇక గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, మత్తు డాక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఉన్న డాక్టర్లు డెప్యుటేషన్‌పై వెళ్లడం, కొత్తవారు ఈ ప్రాంతానికి రావడానికి సుముఖంగా లేకపోవడం వైద్యుల కొరతకు కారణమైంది. ఇక ఆసుపత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతుండడంతో రక్త పరీక్షలకు వచ్చేవారు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందికరంగా ఉంది. అంతేకాక నైట్ సెక్యూరిటీ గార్డు పోస్టు నియామకం చేపట్టాల్సి ఉంది. ఇక ఆసుపత్రిలో అత్యవసర వేళల్లో రక్తం అందించడానికి బ్లడ్ స్టోరేజీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక నెల నుంచి ఉపయోగంలో లేదని తెలిసింది. ఇందుకు సంబంధించి లైసెన్సు రెన్యువల్ కావాల్సి ఉంది. దీంతో ఈ నాలుగు మండలాలకు సంబంధించిన ప్రజలు వైద్య సేవలు అందక ఇబ్బందులకు గురవతున్నారు. దీనిపై గతంలో జిల్లాస్థాయి వైద్యశాఖా ధికారులు ఈ హాస్పిటల్‌ను తనిఖీ చేసేందుకు వచ్చినప్పుడు వైద్యుల నియామకం జరపాలని కోరారు. అలాగే సమస్యను ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్య వైద్యాశాఖాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి సక్రమంగా వైద్యసేవలు అందించాలని పోరుమామిళ్ల ప్రాంతవాసులు కోరుతున్నారు.



పోరుమామిళ్లలోని సామాజిక ఆరోగ్యకేంద్రం

వైద్యుల పోస్టులు భర్తీ చేస్తే...

తాను బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు అవుతుంది. ప్రస్తుతం ఉన్న డాక్టర్లతోనే వైద్యసేవలు అందిస్తున్నాం. ఖాళీగా ఉన్న పోస్టులకు వైద్యుల నియామకం జరిగితే పూర్తిస్థాయిలో సేవలందించేందుకు వీలుగా ఉంటుంది.

-నాగలక్ష్మి, సూపరింటెండెంట్,
పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం





రక్తపరీక్షల కోసం నిరీక్షిస్తున్న వ్యాధిగ్రస్తులు, వైద్యం కోసం వచ్చిన రోగుల అవస్థలు

కోడిగాండ్లపల్లెలో జ్వరాలపై
రిమ్స్ వైద్యుల బృందం ఆరా



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న రిమ్స్ రాపిడ్ రెస్పాన్స్‌టీం

ముద్దనూరు సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కోడిగాండ్లపల్లెలో గురువారం రిమ్స్ మెడికల్ కాలేజీ రాపిడ్ రెస్పాన్స్ టీం పర్యటించింది. విషజ్వరాలతో బాధపడుతున్న బాధితుల ఇళ్ల వద్దకు రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, సామాజిక వైద్య విభాగం డాక్టర్ సురేష్‌రెడ్డి, ప్రొఫెసర్లు నవాజ్, ఖలీల్, కిశోర్‌రెడ్డి బృందం వెళ్లి పూర్తి వివరాలు ఆరాతీశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు బ్యాక్ వాటర్ వల్ల దోమలు విపరీతంగా వస్తున్నాయని బృందం సభ్యులకు వివరించారు. దీంతో గ్రామ సమీపంలో నిల్వ ఉన్న గండికోట బ్యాక్‌వాటర్‌ను బృందం పరిశీలించింది.

అనంతరం మెడికల్ క్యాంప్ వద్ద ఆరోగ్య పరీక్షలు చేశారు. 35 మంది రక్తనమూనాలను సేకరించారు. ఎలిషా పరీక్ష కోసం డెంగ్యూ అనుమానిత ఐదుగురి రక్త నమూనాలను రిమ్స్‌కు తీసుకెళ్లారు. జ్వరాలు తగ్గేంత వరకు గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామని మెడికల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్‌యూనిట్ అధికారి లక్షుమయ్య, ముద్దనూరు, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చిలమకూరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్‌వాటర్, పారిశుధ్యంతోనే సమస్య

కోడిగాండ్లపల్లెలో డెంగ్యూ ప్రబలేందుకు గ్రామంలో పారిశుధ్య లోపం, ప్రధానంగా బ్యాక్‌వాటర్‌తో సమస్యగా ఉంది. గ్రామ సమీపంలో బ్యాక్ వాటర్ నిలిచి ఉన్నందున విపరీతంగా దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దీంతో రాబోవు రోజుల్లో మరింత ప్రమాదకరమైన విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. రక్త నమూనాలను సేకరించి పరీక్షల అనంతరం పూర్తి నివేదిక జిల్లా అధికారులకు అందజేస్తాం.

-డాక్టర్ సురేష్‌రెడ్డి,
రిమ్స్ వైద్యశాల సామాజిక వైద్య విభాగం, కడప

ఉత్సాహంగా సాగిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



బాక్సింగ్‌లో ఎంపికైన బాలికలతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ సమీప వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడలకు సంబంధించి నిర్వహించిన ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ జగన్నాథరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఇందులో ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, జిమ్నా స్టిక్స్, సైక్లింగ్ విభాగాల క్రీడలలో ఉమ్మడి కడప జిల్లా నుంచి పలు వురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి వెల్లడించారు. ఇందులో అండర్-19 విభాగంలో ఎంపికైన బాలబాలికల వివరాలిలా...

బాలికల స్విమ్మింగ్ విభాగంలో....: ఎం.కుసుమ (వేము ల) పి.మంజు (సంబేపల్లి) ఎ.లావణ్య (వేముల) కె.కావ్య (సంబేపల్లి), కె.షీనా (చిన్నమండెం)

బాలుర స్విమ్మింగ్ విభాగంలో...: జి.అరవింద్‌కుమార్ (గాలివీడు), ఎ.దినేష్‌కుమార్ (కమలాపురం), టి.చిన్నగంగరాజు (రాజంపేట), ఎ.దినేష్‌కుమార్ (కమలాపురం), జె.వనిష్‌వర్ధన్ (సిద్దవటం), వై.వరణ్ (రామనపల్లి), జె.శ్రీశాంత్ (కడప), కె.కార్తీక్ (గాలివీడు) ఎ.ప్రకాష్ (గాలివీడు), పీవీ దస్తగిరి (లక్కీపేట), ఎస్.తిరుమలయ్య (రామనపల్లి), పి.సూర్యచరణ్‌తేజ (లక్కీపేట), జి.గణేష్‌రెడ్డి (సి.కె.దిన్నె), ఎస్.మాధవ (కమలాపురం), జి.కార్తీక్ (రామనపల్లి), కె.చెన్నయ్య (రాజంపేట), ఎస్.శ్రీహర్ష (రాజంపేట)

బాక్సింగ్ బాలుర విభాగంలో...: జె.వంశీవర్ధన్ (46కేజీ), జి.జయకృష్ణ (46 కేజీ), ఎస్.హుస్సేన్ (46-49 కేజీ), వి.రాధాకృష్ణ (49-52 కేజీ), కె.లోకేష్ (52-60కేజీ) ఎం.జయ ప్రకాష్ (60-64కేజీ), కె.వంశీ (91 కేజీ)

బాలికల విభాగంలో...: ఎన్.శిరీషా, ఎం.శృతి (45కేజీ) డి.లక్ష్మీప్రసన్న (45-48కేజీ) కె.నవ్య, పి.మంజు (48-51కేజీ) వి.కృష్ణకావ్య, డి.మహాలక్ష్మీ (51-54కేజీ), ఎ.భువనేశ్వరి, వి.చైతన్యలక్ష్మి (54-57కేజీ) ఎన్.వెంకటేశ్వరి (57-60కేజీ) డి.యామిని (60-64కేజీ), వి.మోనిక (64-66కేజీ), ఓ.హిమశైలజ (69-75కేజీ)

మోడరన్ పెంథలాన్ బాలురు : ఎస్.తిరుమలయ్య (రామనపల్లి) సి.రామ్‌చరణ్ (కొత్త మాధవరం), కె.సంజయ్ (రాజంపేట), కె. చెన్నయ్య (రాజంపేట), ఎన్.శివసాయి (రామనపల్లి)

బాలికల విభాగంలో...: జి.నాగచరిత (రామాపురం) డి.మహాలక్ష్మి (రామాపురం), కె.కావ్య (సంబేపల్లి), ఎన్.నాగమణి (రామనపల్లి)

బంగారు గొలుసు దొంగ అరెస్టు

సీకేదిన్నె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడివీధిలో వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దొంగతనం చేసిన కాకర్ల ఆకాష్‌ను అరెస్టు చేసినట్లు సీకేదిన్నె సీఐ బాలమద్దిలేటి తెలిపారు. నందలూరు మండలం నల్లతిమ్మయ్యగారిపల్లెకు చెందిన ఎర్రగోళ్ల లక్షుమ్మ ఈనెల 9న అంగడివీధిలో నడుచుకుంటూ వెళుతుండగా ఆమె మెడలో ని 20 గ్రాముల బంగారు గొలుసును బలవంతంగా లాక్కుపోయాడు. గురువారం నిందితుడి ఆచూకీ తెలుసుకుని సిబ్బందితో కలిసి దాడి చేసి అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి రూ.1.60 లక్షలు విలువచేసే బంగారు చైను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాకు ప్పవారిపల్లె గ్రామానికి చెందిన ఆకాష్ స్టూడెంట్‌గా చదువుకుంటూ వ్యసనాలకు బానిసయ్యాడు. ఇంటిలోని వారికి చెప్పకుండా అప్పులు చేసి వాటిని తీర్చేందుకు చెడుమార్గాన్ని ఎంచుకుని జైలుపాలైనట్లు సీఐ తెలిపారు.

వీధి కుక్కల దాడి... చిన్నారికి గాయాలు

కలసపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక టైలర్ కాలనీలో గురువారం సాయంత్రం వీధికుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారి ఇమ్రాన్ గాయపడ్డాడు. ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా తమబిడ్డపై దాడి చేశాయని తల్లిదండ్రులు మౌళాలి, వహీదాలు తెలిపారు. తాము దగ్గరలో లేకపోయింటే పిల్లాడి పరిస్థితి ఎలా ఉండేదో అని వాపోయారు. ఇమ్రాన్‌కు పోరుమామిళ్లలో చికిత్స చేయించినట్లు తెలిపారు. వీధికుక్కలను అదుపుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటి సామాగ్రి దగ్ధం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాధాక్రిష్ణనగర్‌కు చెందిన సుబ్రమణ్యం అనే వ్యక్తి ఇంట్లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు, టీవీ, ఫ్రిజ్, ఏసీ తదితర పరికరాలు కాలిపోయాయి. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

భారీ స్కోర్ దిశగా కర్నూలు... నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య గురువారం నుండి జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్లు తలపడుతున్నాయి. ఇందులో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 57 ఓవర్లలో 3వికెట్లు మాత్రమే కోల్పోయి 222 పరుగులు చేసింది. ఇందులో ఎం. నయీముల్లా 107 పరుగులు చేయగా, సాయిగణేష్ 57 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లోనెల్లూరు జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 407 పరుగల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోషన్ పవన్ ఏకంగా 226 పరుగులతో , సుతేజ్‌రెడ్డి 89 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి -9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి -9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, PALLINTI VARADHAIAH NAIDU (Old Name) S/o PALLINTI NARASAIAH NAIDU R/o. 2-28, Uttarapu Kandriga VL, Nandhimangalam Po, PUTTUR MDL, CHITTOOR Dt. AP-517583. I changed my name to PALLINTI VARADAIAH NAIDU (New Name) S/o PALLINTI NARASAIAH NAIDU. Henceforth I will be known as PALLINTI VARADAIAH NAIDU (New Name).
AJT -1616

PLOTS FOR SALE
నేషనల్ హైవేలకు ఆనుకొని తిరుపతిలో తుడ ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు అన్నీ వసతులతో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, డైరెక్ట్ ఓనర్. ఫోన్ : 95027 74175 / 79959 92114
AJT - 1598

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 246596

HEALTH CARE
డా॥కె.కీర్తన(M.D., Pediatrics, SVMS &Ex Senior Resident, RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్న పిల్లల వైద్యనిపుణులు. 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. శ్రీ విష్ణు చిన్న పిల్లల హాస్పిటల్, మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డికాలనీ, తిరుపతి. సెల్: 63035 53359
AJT -1599

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, టట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం, ఇన్‌సెట్‌లో వెంకటేష్ (ఫైల్)

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు... బి.కొత్తకోట మండలం తుమ్మనకుంట కనికళ్లతోపు వాసి కృష్ణప్ప కుమారుడు వెంకటేశ్ (35) నాలుగేళ్లుగా మదనపల్లె పట్టణంలోని చౌడేశ్వరీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కనికళ్లతోపులో కోళ్లఫారం, రైస్‌మిల్ నిర్వహిస్తున్నాడు. ఇతడు తాగుడుకు బానిస కావడంతో దానిని మాన్పించడానికి బెంగళూరులో ఆరు నెలల కిందట ట్రీట్‌మెంట్ ఇప్పించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అయినా మార్పు రాకపోగా ప్రతిరోజూ మద్యం తాగి రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చేవాడు. బుధవారం అతడి భార్య కనికళ్లతోపునకు వెళ్లడంతో బుధవారం రాత్రి ఇంటికి రాలేదు. దీంతో ఎక్కడో ఉంటారనుకున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం మదనపల్లె పట్టణం, చంద్రాకాలనీ సమీపంలోని శ్మశానం పక్కన ఓ చెట్టుకు తన చొక్కాతో ఉరివేసుకుని ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అనంతరం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య కీర్తి, కుమారుడు రేషంత్, కుమార్తె వెన్నెల ఉన్నారు.

చోరీ కేసులో బాలుడు అరెస్టు

గుర్రంకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడిన కేసులో నిందితుడైన బాలుడిని గురువారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. ఆయన వివరాల మేరకు ఈనెల 6వ తేదీ పట్టణంలోని బలిజగడ్డకు చెందిన శ్రీనివాసులు ఇంట్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. అప్పట్లో చోరీపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ బాలుడు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. బాలుడి వద్ద నుంచి రూ.60 వేలు నగదును స్వాధీనం చేసుకుని తిరుపతి బాలనేరస్థుల జైలుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

కడప జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా సతీష్

కలికిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఉద్యానశాఖ అధికారిగా జి.సతీష్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఉద్యానశాఖ సహాయ సంచాలకులుగా వున్న సతీష్. ప్రస్తుతం తిరుపతి ఏపీఎంఐపీ (సూక్ష్మ నీటిపారుదల) ప్రాజెక్ట్ డైరెక్టరుగా పనిచేస్తున్నారు. పదోన్నతి కల్పించిన కారణంగా ఆయన్ను బదిలీ చేసి కడప ఉద్యానశాఖ డీడీగా తాత్కాలికంగా నియ మించారు. కాగా ప్రస్తుతం ఉద్యానశాఖ సహాయ సంచాలకులుగా వున్న ఎం.వెంకటేశ్వరరెడ్డి కడప జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తు న్నారు. ఆయనకు కూడా ఉద్యానశాఖలో డీడీగా పదోన్నతి కల్పించి డెప్యుటేషన్ పద్దతిలో తిరిగి ఏపీఎంఐపీ పీడీగానే నియమిస్తూ వ్యవ సాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

'యోగి వేమన' స్టాండింగ్ కౌన్సెల్ రాజీనామా ఆమోదం

కలికిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప యోగి వేమన యూనివర్శిటీ స్టాండింగ్ కౌన్సెల్‌గా గతంలో నియమించిన టి.నిరంజన్ తన పదవికి చేసిన రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం యూనివర్శిటీ తరపున ఆయన రాష్ట్ర హైకోర్టులో స్టాండింగ్ కౌన్సెల్‌గా వ్యవహరిస్తున్నారు.అడ్వకేట్ జనరల్ సూచనల మేరకు నిరంజన్ రాజీనామాను తక్షణం అమల్లోకి వచ్చే విధంగా ఆమోదిస్తున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాలశాఖ కార్యదర్శి జి.ప్రతిభా దేవి గురువారం ఆదేశాలు జారీ చేశారు.

పిడుగుపాటుకు మృతి చెందిన ఆవులకు పరిహారం

కలికిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దమండెం మండలంలోని ఒక రైతుకు చెందిన మూడు పాడి ఆవులు పిడుగుపాటు కారణంగా మృతి చెందిన సంఘటనలో రైతుకు పరిహారం నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. పెద్దమండెం మండలం చెరువుకిందపల్లెకు చెందిన జి.నాగేశ్వరనాయుడుకు చెందిన మూడు పాడి ఆవులు ఏప్రిల్ 3న పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఈ మేరకు పరిహారం చెల్లింపు కోసం జూలై 25న కలెక్టరు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ రూ.1,12,500 గురువారం విడుదల చేసింది. ఈ మొత్తాన్ని బాధిత రైతు నాగేశ్వర నాయుడు బ్యాంకు ఖాతాకు వెంటనే జమ చేయాల్సిందిగా కలెక్టరును ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం నిధుల విడుదల ఉత్తర్వులను జారీ చేశారు.

నెలలో అగ్నిమాపక పరికరాల వివరాలు తెలపాలి

- భవన యజమానులకు అగ్నిమాపక సేవల శాఖ సూచన

విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన యజమానులు నెల రోజుల్లోపు వారి భవనాలలో అగ్నిమాపక పరికరాల వివరాలను తెలియజేయాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మధ్యవర్తులను ఎవరినీ సంప్రదించవద్దని, ఏదైనా సమాచారం కావాలంటే 9441236448 నంబరులో కానీ, కనెక్ట్ డీజీ ఫైర్ జిమెయిల్‌లో కానీ సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు మేరకు 2021-22 సంవత్సరంలో అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రాలను సవరిస్తూ జారీ చేసిన ప్రభుత్వ గెజిట్ మేరకు అగ్నిమాపక చట్టం 1999కి అనుగుణంగా హై రైజెడ్ భవనాలలో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయటానికి సమయం ఇచ్చినట్టు వెల్లడించారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank
నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి పొందిన ("సౌకర్యం") తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను సెప్టెంబర్ 22, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం -https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆదోని	
068762013725	గౌస్ రాఘవేంద్ర
శాఖ పేరు: అమలాపురం	
044157000035	రుద్రరాజు రామలక్ష్మి
శాఖ పేరు: అనంతపురం	
043962018624	[illegible]
043962018598	[illegible]
శాఖ పేరు: అనంతపురం- విద్యుత్ నగర్	
575662000078	షేక్ మహమ్మద్ షాకీర్
శాఖ పేరు: బాపట్ల- ఆంధ్రప్రదేశ్	
358362006038	[illegible]
[illegible]	[illegible]
395462002810	చిన్నమ్మ ఎం
శాఖ పేరు: కైకలూరు, ఆంధ్రప్రదేశ్	
377457000020	పాటూరు హేమంత్
శాఖ పేరు: కాకినాడ	
028057000409	అక్షర ప్రింటర్స్
028062009233	అక్షర ప్రింటర్స్
028062009553	అక్షర ప్రింటర్స్
028062009679	అక్షర ప్రింటర్స్
028062009771	అక్షర ప్రింటర్స్
శాఖ పేరు: కాకినాడ- సర్పవరం	
247757000067	యెర్నాయుడు చేపురుపల్లి
శాఖ పేరు: కల్లూరి	
306962000570	వల్లూరు గాయత్రి నాగ సుబ్బలక్ష్మి
శాఖ పేరు: కంచికచర్ల	
068662013422	[illegible]
శాఖ పేరు: కావలి	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
069362012485	సందీప్ కుమ్మరికుంట
శాఖ పేరు: కొత్తూరు	
378762002605	కంటిపూడి వంశీకృష్ణ
శాఖ పేరు: కర్నూలు- తిలక్ నగర్	
465362000253	ఎం మహేష్
శాఖ పేరు: మదనపల్లె	
067362036657	[illegible]
శాఖ పేరు: మార్కాపురం	
395162004187	పసుపులేటి చంద్రశేఖర్
శాఖ పేరు: నాయుడుపేట	
069462012058	కృష్ణారెడ్డి మనోజ్ రెడ్డి
శాఖ పేరు: నంద్యాల	
[illegible]	[illegible]
శాఖ పేరు: పుట్టపర్తి	
130662006090	[illegible]
130662007854	[illegible]
శాఖ పేరు: రైల్వే కోడూరు	
430662002621	సరగరాజు లలిత
శాఖ పేరు: రణస్థలం	
744062000870	[illegible] రాము
శాఖ పేరు: రేపల్లె	
400162004376	కొండమాదుగుల కోటి రెడ్డి
400162004380	కొండమాదుగుల కోటి రెడ్డి
400162004381	కొండమాదుగుల కోటి రెడ్డి
శాఖ పేరు: శ్రీకాళహస్తి	
375857000157	[illegible]
శాఖ పేరు: తిరుపతి- బై పాస్ రోడ్	
253762002829	మల్లు జనార్ధన రెడ్డి
శాఖ పేరు: తిరుపతి- కెటి రోడ్	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
720957000138	[illegible]
720957000139	[illegible]
720957000145	[illegible]
శాఖ పేరు: [illegible]	
197962013161	యెలకల నంద బాబు
197962013160	[illegible]
శాఖ పేరు: విజయవాడ- ఎనికేపాడు	
432062000692	వంశీకృష్ణ దొప్పలపూడి
శాఖ పేరు: విజయవాడ- వన్ టౌన్	
030357002086	[illegible]
శాఖ పేరు: విజయవాడ- సత్యనారాయణపురం	
[illegible]	[illegible]
279962002384	నిదమోలు సాయి విశ్వనాథ్
శాఖ పేరు: [illegible]	
220162001358	సుదామల్ శ్రీకాంత్
శాఖ పేరు: [illegible]	
398662001698	[illegible] రమణయ్య
శాఖ పేరు: [illegible]	
787557000197	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- కూకట్‌పల్లి	
631262037336	[illegible]
శాఖ పేరు: [illegible]	
222262001158	రాచల కళ్యాణ్ రెడ్డి
శాఖ పేరు: [illegible]	
379962005022	[illegible] రాధిక
శాఖ పేరు: సిద్దిపేట	
069162021895	కొలుపుల కనకవ్వ

తేది: 12.09.2025
ప్రదేశము: అనకాపల్లి, అనంతపురము, అన్నమయ్య, బాపట్ల, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, గుంటూరు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, పల్నాడు, పార్వతీపురం మన్యం, విజయనగరం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, చిత్తూరు, తిరుపతి, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, వై.యస్.ఆర్, ఆత్మకూర్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, నెల్లూరు, రామచంద్రపురం.

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

సత్తాచాటిన 'ములకలచెరువు జడ్పీ'

పోటా పోటీగా వాలీబాల్, ఖోఖో పోటీలు ● అన్నింటా విజేతలుగా జడ్పీహైస్కూల్ విద్యార్థులు





ములకలచెరువులో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు - కొత్త మంచూరు హైస్కూల్‌లో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ మనోహర్‌రాజు

ములకలచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు అన్నింటా విజేతలై నిలిచి సత్తాచాటారు. గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జరిగిన మండల స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలు పోటాపోటీగా సాగాయి. అండర్ -14, అండర్ - 17 పోటీల్లో మొత్తం 39 జట్లు పాల్గొన్నాయి. అండర్ - 17 బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో ములకలచెరువు జడ్పీ హైస్కూల్ విజేతగా, ములకలచెరువు మోడల్ స్కూల్ రన్నర్స్‌గా, బాలికల విభాగంలో బురకాయలకోట గురకుల పాఠశాల విజేతగా, రన్నర్స్‌గా ములకలచెరువు జడ్పీ హైస్కూల్ జట్లు నిలిచాయి. అండర్ - 14 బాలుర విభాగంలో బురకాయలకోట జడ్పీ హైస్కూల్ విన్నర్స్‌గా, రన్నర్స్‌గా సోంపల్లె జడ్పీ హైస్కూల్, బాలికల విభాగంలో బురకాయలకోట గురుకుల పాఠశాల విజేతగా, రన్నర్స్‌గా ములకలచెరువు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నిలిచాయి. అండర్ - 17 ఖోఖోలో ములకల చెరువు జడ్పీ హైస్కూల్ విజేతగా, రన్నర్స్‌గా దేవళచెరువు జడ్పీ హైస్కూల్, బాలికల విభాగంలో ములకలచెరువు జడ్పీ హైస్కూల్ విజేతగా, రన్నర్స్‌గా ములకలచెరువు మోడల్ స్కూల్ జట్లు నిలిచాయి. అండర్ - 14 బాలుర విభాగం ఖోఖోలో విన్నర్స్‌గా ములకలచెరువు జడ్పీ హైస్కూల్ జట్లు, రన్నర్స్‌గా ములకలచెరువు మోడల్ స్కూల్, బాలికల విభాగంలో ములకలచెరువు జడ్పీ హైస్కూల్ విన్నర్స్‌గా, రన్నర్స్‌గా దేవళచెరువు జడ్పీ హైస్కూల్ జట్లు నిలిచాయి. ఈ జట్లు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను ఎంఈఓలు వెంకటరమణ, శంకరప్ప, హెచ్ఎం క్రిష్టారెడ్డి ప్రారంభించారు. పీడీలు అంజప్ప, సరోజమ్మ, శేషారెడ్డి, రేష్మా, ముజాయిద్దీన్, నజీర్, మురళి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వాల్మీకిపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువతకు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం పొందవచ్చని ఎంపీడీఓ మనోహర్ రాజు అన్నారు. కొత్తమంచూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంచుకుని రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్నారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా పలు క్రీడా పోటీలు నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం కూడా మండల స్థాయి పోటీలు జరగనున్నాయి. స్థానిక స్వతంత్ర భారతి పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ గేమ్స్ సెక్రటరీ నాగరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ హరినాథ్, హెచ్ఎం ప్రకాష్, ఫిజికల్ డైరెక్టర్ రెడ్డివరప్రసాద్, ఉపాధ్యాయులు, స్థానిక నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

పెద్దమండ్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పెద్దమండ్యం ఎంఈఓ మనోహర్ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం మోడల్ స్కూల్ ప్రాంగణంలో మండల హైస్కూల్ విద్యార్థులకు గురువారం అండర్ 14, 17 స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడలు ప్రారంభమయ్యాయి. పెద్దమండ్యం ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ మాట్లాడుతూ క్రీడలు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. అందరూ స్నేహభావంతో మెలగాలన్నారు. తొలిరోజు క్రీడ పోటీల్లో విద్యార్థులు, విద్యార్థినులకు వేరువేరుగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరిగాయి. ప్రిన్సిపాల్ రామాంజులు నాయక్, క్రీడ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే సీజ్ చేస్తాం

కోళ్ల ఫారాలను తనిఖీ చేసిన తహసీల్దార్



కోళ్ల ఫారాల వద్ద విచారణ చేపట్టిన తహసీల్దార్ తపశ్విని, ఎంపీడీఓ రమేష్

నిమ్మనపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోళ్ల ఫారాల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే ఫారాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ తపశ్విని, ఎంపీడీఓ రమేష్ హెచ్చరించారు. గురువారం రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి వద్ద నున్న కోళ్ల ఫారాలను తనిఖీ చేసిన వారు మాట్లాడుతూ కోళ్ల ఫారాల వ్యర్థాలు, చనిపోయిన కోళ్ల ద్వారా ఈగలు ప్రబలకుండా బాయిలర్ చేసి వాసన రాకుండా శానిటేషన్ చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో ఈగలు పడుతూ పిల్లలు తినేసమయంలో కూడా ఈగలు వాలుతుండంతో కోళ్ల ఫారాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి గాయత్రి నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి మూడు రోజుల్లో గ్రామంలో ఈగలు రాకుండా చూసే బాధ్యత నిర్వాహకులదే అని గ్రామ సమీపంలో చనిపోయిన కోళ్లను వేయరాదన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రస్తుతం వున్న కోళ్లు అయిపోగానే కోళ్ల ఫారాలను నిలిపివేస్తామని ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ హాకథాన్‌లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ



క్వాంటమ్ హాకథాన్ విన్నర్స్‌గా జ్ఞానాంబిక డిగ్రీ విద్యార్థులు
రన్నర్స్‌గా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హాకథాన్ పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. బుధవారం తిరుపతిలో నిర్వహించిన క్వాంటమ్ కంప్యూటింగ్ కోడింగ్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో స్కైహై కోడర్స్(ఏక్యూవీహెచ్ 910)లో మదనపల్లెకు చెందిన శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. విన్నర్స్ గ్రూపునకు రూ.10వేలు, రన్నర్స్ గ్రూపునకు రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. జ్ఞానాంబిక కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం

● మండల వ్యవసాయాధికారి ప్రేమలత



రైతుసేవా కేంద్రంలో యూరియాను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో అవసరమైన ప్రతి రైతుకూ యూరియాను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఓ ప్రేమలత వెల్లడించారు. గురువారం రంగసముద్రం, తుమ్మరకుంట గ్రామాల్లో ఆయా రైతు సేవా కేంద్రాల్లో తహసీల్దార్ శ్రీరాములు నాయక్, కూటమి నేతలతో కలిసి రైతులకు యూరియాను పంపిణీ చేసిన ఆమె మాట్లాడుతూ మండలంలో పంటలను సాగు చేసిన ప్రతి రైతుకూ యూరియాను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు సహకరించి యూరియా కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి తీసుకెళ్లాలని సూచించారు. కావాల్సిన మేరకు యూ రియాను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యూరియా వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రామకృష్ణ, రంగసముద్రం గ్రామకమిటీ అధ్యక్షుడు నాగార్జున, యువనాయకుడు మహబూబ్‌బాషా, వీరిశెట్టి నారాయణస్వామి, కుమ్మర బాస్కర్, వీరిశెట్టి గంగిరెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కావలసినంత యూరియా ఇస్తాం



పోలీసు బందోబస్తు మధ్య యూరియాను పంపిణీ చేస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరికీ కావలసినంత యూరియా అందిస్తామని ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం నిమ్మనపల్లి, బండ్లపై, వెంగంవారిపల్లి, ముష్టూరు పంచాయతీ ఆర్బీకేల్లో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ లేనిపోని మాటలు విని అపోహలు చెందనవరం లేదన్నారు. ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఏఓ మంజుల పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిద్దాం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేద్దామని ప్రత్యేకాధికారి అమర్‌నాథరెడ్డి, ఏఓ రమణకుమార్ పిలుపునిచ్చారు. ఎంపీడీఓ థామస్‌రాజాతో కలిసి బాలిరెడ్డిగారిపల్లె, కోసువారిపల్లెల్లో ఎక్కువగా యూరియా వాడకంతో కలిగే నష్టాలను రైతులకు వివరించారు. వారు మాట్లాడుతూ ఘన, ద్రవ, జీవామృతాలతో భూసారం పెరగడం, పంటలకు చీడ,పీడలు తక్కువగా సోకుతాయన్నారు. ఆరోగ్యకరమైన పంటల దిగుబడి లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఘనంగా అటవీ అమరుల దినోత్సవం



అటవీ అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అటవీ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పచ్చని వృక్షాల సంరక్షణకు తమ ప్రాణాలను త్యజించిన బిష్ణోయ్ తెగ ప్రజలందరినీ అటవీశాఖ ఉద్యోగులు, ప్రజలు స్ఫూర్తిగా తీసుకోవాలని సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం రేంజర్ కార్యాలయం వద్ద అటవీ అమరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సబ్ డీఎఫ్ఓ మాట్లాడుతూ వృక్షాలను కూల్చకుండా అడ్డుపడడమేకాక ప్రాణాలను సైతం వదిలేసిన బిష్ణోయ్ తెగల గుర్తుగా అటవీ అమరుల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఎఫ్ఆర్ఓ జయప్రసాద రావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అడువులు, వన్యప్రాణుల సంరక్షణ విధుల్లో వుంటూ పలు సంఘటనల్లో మృతి చెందిన అటవీ ఉద్యోగులను అందరు స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రేంజ్ పరిధిలోని ఎఫ్ఎస్ఓలు శివకుమార్, పి.సుధాకర్, జి.సుధాకర్, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, అటవీశాఖ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నానో యూరియాతో సంపూర్ణ నత్రజని

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మొక్కలకు అవసరమైన సంపూర్ణ నత్రజని నానో యూరియాతోనే లభ్యమని వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. పెంచుపాడు, మాలేపాడు, బొమ్మనచెరువు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ ద్రవరూపంలో వుండే నానో యూరియా పంటసాగులో పిచికారీ చేయిస్తే ప్రతి మొక్కకూ అందుతుందన్నారు. యూరియా బదులు నానో యూరియాను రైతులు ఉపయోగించాలని సూచించారు. ఎంపీడీఓ తాజ్ మస్రూర్, తహసీల్దార్ కిశోర్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి



నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పంటలకు నానో యూరియాను వాడాలని ఎంపీడీఓ హరినారాయణ రైతులకు సూచించారు. మండలంలోని పెద్దపాళ్యం సచివాలయంలో గురువారం రైతులకు నానో యూరియా, జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియాను వాడితే పంటలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ సదస్సులో ఎంపీపీ సాయిలీల, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, పాస్టర్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా వినియోగాన్ని తగ్గిస్తే సత్ఫలితాలు



యూరియా పంపిణీని పర్యవేక్షిస్తున్న విశ్వనాథ్

బి.కొత్తకోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వినియోగాన్ని సాధ్యమైనంత మేర తగ్గిస్తే వ్యవసాయంలో సత్ఫలితాలు వస్తాయని మండల స్పెషలాఫీసర్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న యూరియా పంపిణీని పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయండి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ నిర్వహిస్తున్న రణభేరిని విజయవంతం చేయాలని జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ కోరారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 15నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రణభేరి కరపత్రాలను ఆవిష్కరించారు. డివిజన్ కన్వీనర్ సుధాకర్, శీనప్ప, శ్రీనివాసులు, గంగులప్ప, మల్లేశ్వరబాబు, పయని, రవీంద్ర, శ్రీధర్, చలపతినాయుడు, విజయ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఆర్‌అండ్‌బీ రోడ్ల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న డీఈ సూర్యనారాయణరెడ్డి

బి.కొత్తకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులను సర్వేచేసి రోడ్డు భవనాలశాఖ రోడ్ల కొలతలను నిర్ధారించనున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆక్రమణలకు గురైన రోడ్లను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని వెళ్లిన పీజీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు, కలెక్టర్ ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ సిబ్బందితో ఆయన గురువారం బి.కొత్తకోటలో పర్యటించారు. సిబ్బందితో జ్యోతిసర్కిల్‌లో సర్వే చేయించినఆయన మాట్లాడుతూ రెవెన్యూ, మన్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల సమన్వయంతో సర్వే చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



మిథున్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి

మదనపల్లె, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని ఎంపీ నివాసంలో జింకా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండపల్లె అక్కులప్ప ఉన్నారు. అంతకుముందు ఉదయం పట్టణంలోని బసినికొండలోని 11, 12 వార్డుల్లో కౌన్సిలర్ జింకా రాధమ్మ ఆధ్వర్యంలో జింకా అనుచరులు, పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఆటో కార్మికుల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలతో సూపర్ హిట్ కొట్టిన కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం దసరా కానుక ఇస్తోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన సూపర్‌సిక్స్ బహిరంగ సభ చూసి ఓర్వలేక జగన్ పిచ్చిపట్టి ప్రేలాపణలు చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం కింద రూ.15వేల చొప్పున పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారని గుర్తుచేశారు. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించేందుకు హంద్రీనీవా జలాలను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఇకనైనా వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. టీడీపీ నేతలు రామచంద్రనాయుడు, రెడ్డెప్ప, రమణ, రాజన్న, గోవర్ధన పాల్గొన్నారు.

'జగన్‌వి దిగజారుడు రాజకీయాలు'

ములకలచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వ్యక్తిగతంగా దూషించడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ అన్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావడంతో జీర్ణించుకోలేక జగన్ చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలక దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు భజంత్రీ రామాంజులు, టీడీపీ నేతలు మూగి రవిచంద్ర, చాంద్‌బాషా, కట్టా హరినాధ్, భాస్కర్‌రెడ్డి, రెడ్డెప్ప, రమణమూర్తి, గాలి నారాయణ, అశోక్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రగన్నమిట్ట కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తామని తట్టివారిపల్లె టీడీపీ ఇన్‌చార్జి ఎస్ఆర్ షంషీర్ హామీ ఇచ్చారు. గురువారం బాలాజీ నగర్, ఎర్రగన్నమిట్ట, ఆర్టీఓ కార్యాలయం ప్రాంతాల్లో షంషీర్ ప్రజల సమస్యలపై గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుర్రప్ప నాయుడు, మహేష్, మధు, నాగరాజు, భాస్కర్, లాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎస్ డీటీ సుబ్బయ్య హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం మండల కేంద్రంలోని వివిధ ప్రైవేటు బియ్యం దుకాణాలు, ప్రైవేటు రైస్ మిల్లులను తనిఖీ చేశారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో ఆయన వివిధ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి కేసులు నమోదు చేస్తామన్నారు.

సమస్య పరిష్కరించకపోతే విధులకు రాము



పంచాయతీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వేకువజాము నుంచీ ఊరంతా ఊడిగం చేస్తాం. మాకు సమస్య వస్తే ఆర్చి తీర్చేవారే లేరా అంటూ వాల్మీకిపురంలో పంచాయతీ కార్మికులు నిరసన గళం విప్పారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ తమ సమస్యలను వెలిబుచ్చారు. 2012 మే నుంచి 2018 వరకు పీఎఫ్ చెల్లించామన్నారు. 2025 ఏప్రిల్ నుంచి తమకు వేతనం ఇస్తున్నా 2018 నుంచి తమకు కట్టాల్సిన పీఎఫ్ కడితేనే వచ్చే నెల 1వ తేదీ నుంచి విధులకు హాజరవుతామని లేని పక్షాన నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకురాలు చంద్రావతి, పంచాయతీ కార్మిక సంఘ నేతలు వెంకటరమణ, శ్రీరాములు, వెంకటేష్, కార్మికులు రాజు, చంద్ర, వసంతమ్మ, భారతమ్మ, శివప్రసాద్, గురవయ్య, చంద్రశేఖర్, హరినాథ్, గాయత్రి, ప్రమీల, శ్రీనివాసులు, హరిప్రసాద్, జయరామ్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

రేపు శనీశ్వరుడికి మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో 13న శనివారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 7.30గంటల నుంచి శని భగవానునికి మహాతైలాభిషేకం, రుద్రాభిషేకం, విశేష పూజలు జరుగుతాయని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వివేకానంద జీవితం స్ఫూర్తిదాయకం



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వివేకానంద జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని బీజేపీ నేత బండి ఆనంద్ అన్నారు. గురువారం స్థానిక సొసైటీకాలనీలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. 132 ఏళ్ల కిందట సెప్టెంబరు 11న అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మహాసభలో స్వామి వివేకానంద ప్రసంగం కట్టిపడేశాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత తెలిపేలా ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి, భగవాన్, గుడ్‌విల్ కంప్యూటర్స్ అజయ్, కిరణ్ కుమార్, ప్రేమచంద్, శ్రీకాంత్, కిరణ్, వెంకటేష్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే చర్యలు

ములకలచెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ పరిసరాల్లో చెత్తాచెదారం వేస్తే చర్యలు తప్పవని శ్రీ సత్యసాయి జిల్లా కదిరి రైల్వే ఏఎస్ఐ శివారెడ్డి హెచ్చరించారు. ములకలచెరువు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో చెత్తాచెదారం వేస్తున్న 15 మందిని గుర్తించి జరిమానాలు విధించారు. ఆయన వెంట కానిస్టేబుల్ గురుమూర్తి ఉన్నారు.

యూరియా పంపిణీ తనిఖీ

పెద్దమండ్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బండమీదపల్లి, కోటకాడపల్లి రైతు సేవా కేంద్రాల్లో గురువారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పెద్దమండ్యం ఎస్ఓ దామోదర్‌రెడ్డి తనిఖీ చేశారు. పంపిణీ జరుగుతున్న సరళి పరిశీలించారు. ప్రస్తుతం సాగులో వున్న పంటల వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయాల్లో జీఎస్ సిబ్బందితో సమావేశమై రోజూ పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ జ్వరాలుంటే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని తెలిపారు. జీఎస్ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఆయా గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లకు తెలియజేయాలన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో వసతుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏఓ సురేష్‌బాబు, వ్యవసాయ సిబ్బంది అనుదీప్, సమీనా, శివకుమార్, కదిరిమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ నయమవుతుంది

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి మందులతో నయం అవుతుందని టీబీ ప్రోగామ్ జిల్లా కో ఆర్డినేటర్స్ వెంకటసుబ్బయ్య, ప్రణీత్ అన్నారు. గురువారం మదనపల్లె టీబీ యూనిట్ పరిధిలో మొండి క్షయ కోసం మందులు మింగుతున్న పేషంట్లను మదనపల్లె టీబీ యూనిట్ సిబ్బంది, సంబంధిత ఆరోగ్య సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవల గురించి, టీబీ డాట్ సెంటర్ నిర్వహణ, ల్యాబ్‌లో గళ్ల పరీక్షలు చేసే విధానం పరిశీలించారు. టీబీ యూనిట్ పరిధిలో టీబీ కోసం మందులు వాడుతున్న వివరాలు, గళ్లపరీక్షలు చేసుకున్న వారి వివరాల రికార్డులు తనిఖీ చేశారు. టీబీ విభాగం సూపర్‌వైజర్ ప్రభాకర్, శాంతి, సుశీల, వనజ కుమారి, తరుణ్, సునీత, సంధ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.